


TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

# తెలంగాణ శాసనసభ

తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 155 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | ఆదివారం 10 నవంబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-



# ప్రధాని అబద్ధాలు చెప్పడం మానుకోకపోతే.. మేం నిజాలు చెబుతూనే ఉంటాం



- గ్యారెంటీల అమలుపై తమ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం
- మోదీ అబద్ధాలు చెప్పడం మానుకోకపోతే తాము నిజాలు చెబుతామన్న సీఎం
- కేంద్రం, మహారాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని మరిచాయని విమర్శ

**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వంపై ప్రధాని నరేంద్రమోదీ అబద్ధాలు చెబుతున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ముంబైలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మహారాష్ట్ర బీజేపీ నేతలు తెలంగాణ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారని మండిపడ్డారు. ప్రధాని నరేంద్రమోదీ కూడా తెలంగాణలోని ఆరు గ్యారెంటీల అమలుపై మహారాష్ట్రలో అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. మోదీ అబద్ధాలు చెప్పడం మానుకోకపోతే తాము నిజాలు చెబుతూనే ఉంటామని వ్యాఖ్యానించారు. తెలంగాణలోని ఆరు గ్యారెంటీలపై నిజాలు చెప్పేందుకే తాను మహారాష్ట్రకు వచ్చానన్నారు. మహారాష్ట్రలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని మరిచాయని ఆరోపించారు. నల్లచట్టాలు తెచ్చి అదానీ, అంబానీలకు మేలు చేయాలని మోదీ చూస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో రైతులకు తమ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసిందని వెల్లడించారు. 22 లక్షల మంది రైతులకు రూ.17,869 కోట్లు మాఫీ చేశామన్నారు. రుణమాఫీపై వివరాలు కావాలంటే ఇవ్వడానికి తాము సిద్ధమన్నారు.

మిగతా »»2లో

## ప్రశ్నించేవారంటే రేవంత్ రెడ్డికి అంత కోపం ఎందుకు?


- జర్నలిస్ట్ అరెస్ట్ అప్రజాస్వామికమన్న కేటీఆర్
- ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం
- నిఘా వేసి.. రెక్కీ నిర్వహించి అరెస్ట్ చేశారన్న హరీశ్ రావు




**శాసనసభ / హైదరాబాద్ :** ప్రశ్నించే వారంటే సీఎం రేవంత్ రెడ్డికి అంత కోపం ఎందుకు? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. జర్నలిస్ట్, వైఆర్ టీవీ రంజిత్‌ను అరెస్ట్ చేయడంపై కేటీఆర్, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ అరెస్ట్ అప్రజాస్వామికమని కేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్రంలో ఎవరు ప్రశ్నిస్తే వాళ్లపై అక్రమ కేసులు పెడుతున్నారని, దాడులు చేస్తున్నారని విమర్శించారు. మీ 11 నెలల పాలనలో జర్నలిస్ట్‌లపై దాడులు, అక్రమ కేసులు నిత్యకృత్యమయ్యాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి చేసే దద్దమ్మ పనులను నిలదీసినందుకే జర్నలిస్ట్ రంజిత్‌ను నిర్బంధించారన్నారు. అతనిని వెంటనే విడుదల చేయాలని..

## రైతులకు ధైర్యం చెప్పిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

- రైతులు అధైర్యపడవద్దన్న మంత్రి
- పంటలకు మద్దతు ధర ఇస్తామని హామీ
- డిసెంబరు నెలాఖరులోగా పెండింగ్ రుణమాఫీ చేస్తామని వెల్లడి



**శాసనసభ / హైదరాబాద్ :** మద్దతు ధరపై తెలంగాణ రైతులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ధైర్యం చెప్పారు. రైతులు అధైర్యపడవద్దని..పంటలకు మద్దతు ధర ఇస్తామని హామీ ఇచ్చారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...డిసెంబరు నెలాఖరులోగా పెండింగ్‌లో ఉన్న రూ.13 వేల కోట్ల రుణమాఫీ చేస్తామన్నారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి తీరుతామని వెల్లడించారు. రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు. డిసెంబరులో గ్రూప్ 1 అభ్యర్థులకు నియామక పత్రాలు ఇచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

## మోదీ వ్యాఖ్యలను తెలంగాణ బీజేపీ నేతలు ఖండించారా?

- కులగణనకు బీజేపీ అనుకూలమా? వ్యతిరేకమా? చెప్పాలని నిలదీత
- సామాజిక మార్పు కోసమే కులగణన చేపడుతున్నట్లు వెల్లడి
- కులగణనపై బీజేపీ నేతల వ్యాఖ్యలు గమనించాలని వ్యాఖ్య




**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రధాని నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యలను ఇక్కడి బీజేపీ నేతలు ఒక్కసారైనా ఖండించారా? అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు.

## తాము ఏం కోల్పోయారో ప్రజలకు అర్థమైంది




- చాన్నాళ్ల తర్వాత గొంతుక వినిపించిన కేసీఆర్
- తమకు కూడా తిట్టడం వచ్చన్న బీఆర్ఎస్ చీఫ్
- మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా

**శాసనసభ / హైదరాబాద్ :** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చాన్నాళ్ల తర్వాత తన గొంతుక వినిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తనదైనశైలిలో ధ్వజమెత్తారు.

మిగతా »»2లో

## తిరుపతి ప్రత్యేక రాష్ట్రం కోసం పిటిషన్.. సుప్రీంకోర్టు తిరస్కరణ




## "మీతో సెక్స్ చేయం" ట్రంప్ గెలుపుకి మగాళ్లని నిందిస్తున్న మహిళలు..

2




## జమిలి ఎన్నికలు అసాధ్యం.. ప్రజలను గందరగోళం చేయొద్దు



**ఢిల్లీ / శాసనసభ :** రాజన్న సిరిసిల్లలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సీపీఐ పార్టీ కార్మిక భవనంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలపై చర్చ జరుగుతుందని.. జమిలి ఎన్నికలు అసాధ్యం అని అన్నారు. ఒకే దేశం-ఒక ఎన్నిక అన్న వారు.. రేపు ఒకే మతం అని కూడా అంటారని ప్రధాని మోడీపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మిగతా »»2లో

## సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త: ఏకంగా హైదరాబాద్ సీపీ డీపీతో వాట్సాప్ కాల్స్




**శాసనసభ / హైదరాబాద్ :** సైబర్ కేటుగాళ్లు సరికొత్త మోసాలకు తెరతీస్తున్నారు. ఏకంగా పోలీసు ఉన్నతాధికారులనే తమ మోసాలకు వాడుకుంటున్నారు. అధికారుల ఫొటో లను డీపీలుగా పెట్టుకుని వాట్సాప్ కాల్స్ చేస్తూ ప్రజలను భయపెట్టి మోసాలకు పాల్పడుతున్నారు.కాగా, హైదరాబాద్‌కు చెందిన పలువురికి సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఫొటో డీపీగా ఉన్న వాట్సాప్ నెంబర్ నుంచి శుక్రవారం కాల్స్ వచ్చాయి.సీపీ ఆనంద్ డీపీతో కాల్స్ రావడంతో ఆ వ్యక్తులు కొంత భయాందోళనలకు గురయ్యారు. కాల్స్‌పై సీపీ ఫొటో డీపీగా ఉండటం, ఫోన్ నెంబర్ అనుమానాస్పదంగా ఉండటంతో ఆ కాల్స్‌కు స్పందించని కొందరు విషయాన్ని సైబర్ క్రైంతోపాటు సీపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో వెంటనే స్పందించిన హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్.. తన ఫొటో డీపీగా ఉన్న నెంబర్ నుంచి వచ్చే కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు.సైబర్ నేరగాళ్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన చేశారు. ఏమైనా అనుమానాలు ఉంటే. సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930, డయల్ 100/122 నెంబర్లకు ఫోన్ చేసి పోలీసులను సంప్రదించాలని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ సూచించారు. తన డీపీతో వచ్చిన ఫోన్ కాల్స్ పరిశీలించామని, ఆ ఫోన్ నెంబర్ పాకిస్థాన్ కంట్రీ కోడ్ కోడ్ (o92)తో ప్రారంభమయ్యాయని తెలిపారు.ఇండియా ఫోన్ నెంబర్లు o91 కంట్రీ కోడ్‌తో ప్రారంభమవుతాయని, అది ప్రజలు గమనించాలని సీపీ సూచించారు. 92 కంట్రీ కోడ్‌తో పోలీసుల పేరుతో ఎవరు కాల్స్ చేసినా.. రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా ఎవరూ స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. ఏమైనా అనుమానం ఉంటే వెంటనే సైబర్ క్రైం హెల్ప్ లైన్ నెంబర్ల(1930, డయల్ 100/122)ను సంప్రదించాలని ప్రజలకు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ సూచించారు.

## వైద్యుల నిర్లక్ష్యంతో యువతి మృతి: మల్లారెడ్డి ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత, మీడియాపై దాడి




**శాసనసభ / హైదరాబాద్ :** కుత్బుల్లాపూర్‌లోని మల్లారెడ్డి ఆస్పత్రి వద్ద శనివారం సాయంత్రం తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. చికిత్స కోసం వచ్చిన యువతి వైద్యుల నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోయిందని ఆమె బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు.అయితే, కవవరేజీకి వెళ్లిన మీడియా ప్రతినిధులపై మల్లా రెడ్డి ఆస్పత్రి బౌన్సర్లు దాడి చేశారు. దీంతో సూరారం పోలీస్ స్టేషన్‌లో మీడియా ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.మూడు రోజుల క్రితం కిడ్నీలో రాళ్లు వచ్చాయని చికిత్స కోసం ఓ యువతి మల్లారెడ్డి ఆస్పత్రిలో చేరింది. వైద్యులు ఆపరేషన్ చేయడంతో తీవ్ర రక్తస్రావానికి గురై శనివారం ప్రాణాలు కోల్పోయింది. దీంతో ఆస్పత్రి ఎదుట మృతురాలి బంధువులు ఆందోళనకు దిగారు. న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. దీంతో ఆస్పత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు ఆస్పత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు.కర్ణాటక రాష్ట్రంలోని గుల్బార్గా జిల్లా కమలాపురం వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బొలెరో వాహనం కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వీరంతా హైదరాబాద్ యూసుఫ్‌గూడకు చెందినవారు. గానుగాపూర్ దత్తాత్రేయ క్షేత్రానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతులను భార్గవ్ కృష్ణ, ఆయన భార్య సంగీత, వారి కుమారుడు ఉత్తమ్ రాఘవన్, రాఘవేంద్రగా గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## హైదరాబాదీలకు అలర్ట్: 11న ఈ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా బంద్

**శాసనసభ / హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో నవంబర్ 11న తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని సంబంధిత అధికారులు తెలిపారు. మరమ్మతుల దృష్ట్యా సోమవారం ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు నీటి సరఫరా ఉండబోదని అధికారులు చెప్పారు.హైదరాబాద్ నగరంలోని ఆర్సీపురం,అశోక్ నగర్, జ్యోతినగర్, లింగంపల్లి, గంగారం, మదీనగూడ, మియాపూర్, బీరంగూడ, అమీన్‌పూర్, ఎర్రగడ్డ, కేపీహెచ్‌బీ, మూసాపేట, చందానగర్, జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాల్లో సోమవారం నీటి సరఫరా ఉండబోదని.. ఈ ప్రాంతాల్లోని ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు.సిటీలో అక్రమ నిర్మాణాలపై విరుచుకుపడిన హైడ్రా హైదరాబాద్ నగరంలోని అక్రమ నిర్మాణాపై మరోసారి హైడ్రా విరుచుకుపడింది. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణల కూల్చివేతలపై కొద్ది రోజులుగా నిశ్శబ్దంగా ఉన్న హైడ్రా.. తాజాగా, శనివారం ఫిల్మ్ నగర్ రోడ్డు నెం.12లో బుల్డోజర్లతో విరుచుకుపడింది. అక్కడి ప్రముఖ విగ్రహాల సమీపంలోని నిర్మాణాన్ని నేలమట్టం చేసింది. రెండు జేసీబీల సహాయంతో హైడ్రా సిబ్బంది షెడ్డును కూల్చివేశారు.ఫిల్మ్ నగర్ హౌజింగ్ సొసైటీ రోడ్డును ఆక్రమించి ఫిల్మ్ నగర్ మహిళా మండలి పేరుతో నిర్మాణం చేపట్టి కార్యకలాపాలు నిర్వహిస్తోందని స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదును పరిశీలించిన హైడ్రా డిప్యూటీ సిటీ ప్లానర్.. మూడు రోజుల కిందట ఫిల్మ్ నగర్ హౌజింగ్ సొసైటీకి నోటీసులు జారీ చేశారు.అనధికారికంగా నిర్మించిన ఫిల్మ్ నగర్ మహిళా మండలి భవనాన్ని 24 గంటల్లో తొలగించాలని ఆదేశించారు. అయితే, ఫిల్మ్ నగర్ హౌజింగ్ సొసైటీ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో అనధికారిక నిర్మాణాన్ని కూల్చివేశామని హైడ్రా అధికారులు తెలిపారు. ఆ ప్రదేశంలో ఉన్న విగ్రహాల జోలికి వెళ్లలేదని చెప్పారు.అయితే హైడ్రా కూల్చివేతపై ఫిల్మ్ నగర్ హౌజింగ్ సొసైటీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తమ సొసైటీకి చెందిన 290 గజాల్లో మహిళా మండలి భవనంతో పాటు విగ్రహాలు పెట్టడానికి కేటాయించామని, తాము ఎలాంటి రోడ్డును ఆక్రమించలేదని సొసైటీ కార్యదర్శి ఖాజా సూర్యనారాయణ తెలిపారు. తమ స్థలంలోని నిర్మాణాన్ని హైడ్రా అన్యాయంగా కూల్చివేసిందని వాపోయారు.

## 14 నుంచి కాంగ్రెస్ ప్రజా విజయోత్సవాలు: భట్టి విక్రమార్క

**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనపై నవంబర్ 14 నుంచి డిసెంబర్ 9 వరకు ప్రజా విజయోత్సవాలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.ప్రజా విజయోత్సవాలు ఏ విధంగా జరపాలి, ఏ అంశాలపై ప్రచారం చేయాలనే దాని విధివిధానాలు రూపొందించేందుకు భట్టి విక్రమార్క అధ్యక్షతన శనివారం కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది.ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకోవడంతోపాటు రోడ్ మ్యాప్ సిద్ధం చేశారు. ప్రజా ఉత్సవాల్లో భాగంగా ఉస్మానియా ఆస్పత్రి, స్పోర్ట్స్ వర్సిటీకి శంకుస్థాపన చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. నవంబర్ 28న పారామెడికల్, 16 నర్సింగ్ కాలేజీలను ప్రారంభిమస్తామన్నారు. ఉత్సవాల్లో భాగంగా పలు కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటామని చెప్పారు. గ్రూప్-4కు ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేస్తామన్నారు. డిసెంబర్ 9న హైదరాబాద్ నగరంలో భారీగా ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వివరించారు. దివంగత మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి రోజున ప్రజా



విజయోత్సవాలు ప్రారంభించి, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ పుట్టిన రోజు వరకు నిర్వహించే విధంగా ప్రణాళికలు రూపొందించింది. విజయోత్సవాల్లో భాగంగాభారీగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ 25 రోజులపాటు వివిధ రకాల కార్యక్రమాలతో పాటు పలు కీలక అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలపైనా ప్రజలకు ఈ సందర్భంగా వివరించనున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి మొదలుపెట్టి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామస్థాయి వరకు ఈ సంబరాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## మళ్లీ నాగార్జునసాగర్ వద్ద ఏపీ, తెలంగాణా వివాదం...

**శాసనసభ / హైదరాబాద్ :** కృష్ణా జలాల విషయంలో ఏపీ, తెలంగాణ అధికారుల మధ్య వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉన్న జలవివాదాలు కేంద్రం మధ్యవర్తిత్వం తీసుకున్నప్పటికీ నేటికీ పరిష్కారం కాలేదు.ఇక తాజాగా ఏపీ తెలంగాణ అధికారుల మధ్య నాగార్జున సాగర్ వద్ద మరోమారు వివాదం చోటుచేసుకుంది.నాగార్జున సాగర్ వద్ద ఏపీ, తెలంగాణా అధికారుల వివాదం నాగార్జునసాగర్ కుడికాలువ వాటర్ రీడింగ్ కోసం తెలంగాణ సిబ్బంది నాగార్జునసాగర్ డ్యాం వద్దకు వెళ్లారు. అయితే అక్కడ ఆంధ్రప్రదేశ్ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. తెలంగాణ వారికి మీకు ఇక్కడేం పని అంటూ వారిని అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేశారు. దీంతో మరోమారు రెండు రాష్ట్రాల మధ్య అగ్నికి ఆజ్యం పోసినట్టు అయింది.ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య వాగ్వాదం నీటి విడుదలకు సంబంధించిన లెక్కలు చెప్పేది లేదని రీడింగ్ తియ్యవద్దని వారిని అడ్డుకున్నారు. మీరు ఎవరికైనా చెప్పుకోండి అంటూ



బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో తెలంగాణ ఇరిగేషన్ అధికారులకు కేఆర్ ఎంబి సమాచార గ్రూపులతో సహా అధికారులందరికీ రెండు రాష్ట్రాలు విభజన జరిగి పదేళ్లు దాటినప్పటికీ తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పంపకం విషయంలో వివాదాలు సమసిపోలేదు.గత నవంబర్లో అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా నాగార్జునసాగర్ డ్యాం పైన జల వివాదం నేపథ్యంలో ఏపీ, తెలంగాణ పోలీసులు మోహరించడంతో యుద్ధ వాతావరణం కొనసాగింది. మళ్ళీ ఇప్పుడు ఇరు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పైన వివాదం చోటుచేసుకుంది.

## సమగ్ర కుటుంబ సర్వేకు దూరంగా ఆ గ్రామాలు.. కలెక్టర్ కీలక ప్రకటన

**శాసనసభ / హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలంతా సహకరించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు.సర్వేపై వివిధ శాఖల అధికారులతో చర్చించడం జరిగిందని.. ఈ సర్వే పూర్తిగా ప్రభుత్వపరంగా చేపడుతున్నదని.. సర్వే ఆధారంగా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయబడతాయని అన్నారు. కావున ఈ సర్వేలో ప్రజలందరూ స్వచ్ఛందంగా భాగస్వామ్యం



కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కొన్ని గ్రామాలలో సర్వేను బహిష్కరించడం సరికాదని.. జిల్లాలో వివిధ కారణాలతో సర్వేను బహిష్కరించిన, అడ్డుకునే ప్రయత్నం చేసిన సంబంధిత వారిపై చర్యలు కఠిన ఉంటాయని కలెక్టర్ తెలిపారు.సమగ్ర కుటుంబ సర్వే ఏ రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని.. సర్వే పై ఎటువంటి అపోహలు పెట్టుకోకుండా ప్రజలందరూ సర్వేలో తప్పనిసరిగా పాల్గొనాలని కలెక్టర్ కోరారు. సర్వే నిర్వహిస్తున్నందుకు ప్రభుత్వానికి వివిధ వర్గాల వారు అభినందనలు తెలియజేస్తూ ఈ సర్వేను తొందరగా పూర్తి చేయాలని కోరుతున్నారని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే హౌస్ లిస్టింగ్ పూర్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు. సర్వేపై ఎటువంటి సందేహాలున్నా క్షేత్రస్థాయిలో ఎంపీడీవోలు, తహసీల్దారులు, అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సర్వేకు సహకరిస్తున్న ప్రజలందరికీ కలెక్టర్ కృతజ్ఞతలు తెలుపుతూ.. ఎన్యుమరేటర్లకు, సర్వే సిబ్బందికి సరైన సమాచారం అందించి సహకరించాలని ప్రజలను కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## "మీతో సెలిక్స్ చేయం".. ట్రంప్ గెలుపుకి మగాళ్లని నిందిస్తున్న మహిళలు..

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ గెలవడం ఆ దేశంలోని లక్షలాది మంది మహిళలకు నచ్చడం లేదు. కమలా హారిస్ నేతృత్వంలోని డెమొక్రాట్ పార్టీ గెలుస్తుందని అంతా భావించినప్పటికీ, వాళ్ల కలలు డొనాల్డ్ ట్రంప్ విజయంతో చెరిగిపోయాయి.అయితే, ట్రంప్ విజయానికి మగవాళ్లే కారణం అంటూ అక్కడి మహిళలు నిప్పులు చెరుగుతున్నారు. చాలా మంది మహిళలు పురుషులతో సెలిక్స్, డేటింగ్, పిల్లలు కనడం వంటి వాటికి దూరంగా ఉండాలని 4B ఉద్యమంలో చేరారు.నిజానికి ఎన్నికల సమయంలోనే కమలా హారిస్ క్యాంపెయిన్ ట్రంప్‌ని స్త్రీవాద వ్యతిరేక వ్యక్తిగా చిత్రీకరించింది. అయితే, అఖండ మెజారిటీతో ట్రంప్ గెలవడంతో చాలా మంది మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. వీటికి సంబంధించిన వీడియోలు,ఫోటోలు ప్రపంచవ్యాప్తంగా వైరల్ అవుతున్నాయి. దీంతో చాలా మంది మహిళావాదులు ఈ "4B మూమెంట్"లో చేరారు.ఇప్పుడు ఇది అమెరికాలో ట్రెండ్ అవుతోంది.పురుషులతో సంబంధాలు పెట్టుకోవద్దని ఒక సెక్షన్ మహిళలు పెద్ద ఎత్తున నినదిస్తున్నారు.అసలు "4B మూమెంట్" ఏంటి..? 4B అనేది " 4 నోస్" అని అర్థం. కొరియన్‌లో "Bi" అంటే "వద్దు" అనే అర్థం వస్తుంది. 2018లో సౌత్ కొరియాలో మొదలైంది. అక్కడి రాడికల్ ఫెమినిస్టులు ఈ ఉద్యమాన్ని సోషల్ మీడియా ద్వారా విస్తృతం చేశారు. ఇది పురుషులతో "వివాహం,సెక్స్, బిడ్డల్ని కనడం, డేటింగ్" వంటివి వద్దు అనే నాలుగు విషయాలకు ప్రాధాన్యత ఇచ్చాయి.అయితే, యూఎస్ ఎన్నికల్లో చాలా మంది మహిళలు తమ పునరుత్పత్తి హక్కుల్ని కాపాడే వ్యక్తి కమలా హారిస్ గెలవాలని కోరుకున్నారు. ట్రంప్ గెలవడంతో పురుషుల పాత్ర ఉందని భావిస్తున్న కొందరు మహిళలు ఈ "4B ఉద్యమం"లో భాగస్వామ్యమయ్యారు. ఎన్నికలు ముగిసిన తర్వాత కొందరు మహిళలు సోషల్ మీడియా ద్వారా ఈ ఉద్యమాన్ని ప్రేరేపిస్తున్నారు. "మహిళలు మరవకండి మనకు శక్తి ఉంది. మన శరీరాలను మగవారికి అప్పగించడం మన ఛాయిస్. దీన్ని ఇక మనం చేయాల్సిన అవసరం లేదు"అంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ పెడుతున్నారు. మరోవైపు 4బీ ఉద్యంలో పాల్గొన్న మహిళలపై మరో వర్గం మహిళలు విమర్శలు గుప్పిస్తున్నారు. "మీరు ఒక వ్యక్తితో పడుకోవాలని అనుకోంటే, ఒక్క వ్యక్తి నిద్ర కూడా చెడిపోదు" అంటూ మరో వ్యక్తి కామెంట్ చేశాడు.

## తిరుపతి ప్రత్యేక రాష్ట్రం కోసం పిటిషన్.. సుప్రీంకోర్టు తిరస్కరణ

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిని ప్రత్యేక రాష్ట్రం లేదా కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ.పాల్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.కేవలం 700 మందికిపైగా ఉన్న ప్రజల కోసం వాటికన్ సిటీ దేశంగా ఉందంటూ ఉదాహరణ చూపుతూ.. అంతకంటే ఎక్కువ జనాభా ఉన్న తిరుపతిని కూడా ఒక ప్రత్యేక రాష్ట్రంగా గుర్తించాలని పిటిషన్‌లో కేఏ.పాల్ కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతిష్టతను కాపాడేందుకే ఈ పిటిషన్ వేసినట్లు పేర్కొన్నారు. పిటిషన్‌ను వ్యక్తిగతంగా కేఏ.పాల్ వాదించారు. అయినా కూడా సుప్రీం ధర్మాసనం పిటిషన్ కొట్టేసింది.తిరుపతిని ప్రత్యేక రాష్ట్రం చేస్తే.. దేశంలో ఉన్న ఇతర దేవాలయాల కోసం కూడా ఒక్కో రాష్ట్రాన్ని కేటాయించాల్సి ఉంటుందని.. జగన్నాథ్ పూరి కోసం, కేదార్‌నాథ్ కోసం, బద్రీనాథ్ కోసం, మదురై దేవాలయం కోసం, రామేశ్వరం దేవాలయం కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలి." అని డిమాండ్ వస్తుందని జస్టిస్ బీఆర్ గవాయ్, కేవీ. విశ్వనాథన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. ఒక్కో దేవాలయం కోసం రాష్ట్రంగా పరిగణించడం కుదరదని న్యాయస్థానం స్పష్టం చేసింది. దీంతో పిటిషన్‌ను కొట్టేసింది. అలాగే తిరుపతి లడ్డూ వివాదంపై దాఖలైన పిటిషన్‌ను కూడా శుక్రవారం సుప్రీంకోర్టు కొట్టివేసింది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ), సీబీఐ వ్యతిరేకంగా ఆయన పిటిషన్ వేశారు. సిట్ నివేదిక టైమ్‌లైన్‌కు సంబంధించి ఎలాంటి ఆదేశాలు ఇవ్వడానికి కూడా కోర్టు నిరాకరించింది.

### మోదీ వ్యాఖ్యలను తెలంగాణ బీజేపీ నేతలు ఖండించారా?:

కులగణనపై ఆయన మాట్లాడుతూ... కులగణనకు బీజేపీ అనుకూలమా? వ్యతిరేకమా?చెప్పాలన్నారు. సామాజిక మార్పు తీసుకు రావడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సర్వే చేపడుతోందని స్పష్టం చేశారు. ఈ సర్వే ద్వారా ప్రభుత్వం సేకరిస్తున్న సమాచారం గోప్యంగా ఉంటుందని హామీ ఇచ్చారు. బీజేపీ... బీసీ,ఎస్సీ,ఎస్టీ వ్యతిరేక పార్టీ అని ఆరోపించారు. కులగణనపై బీజేపీ నేతల వ్యాఖ్యల పట్ల బలహీనవర్గాలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రయోజనం కోసమే కులగణన చేపడుతున్నట్లు బీజేపీ నేత లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు.ఇప్పుడు ఏ ఎన్నికలు ఉన్నాయో చెప్పాలని నిలదీశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు ఉండాలా? వద్దా? చెప్పాలని నిలదీశారు. ఐఐటీ, ఐఐఎం లాంటి ఉన్నత విద్యాసంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ పార్టీయే అన్నారు.

## ప్రశ్నించేవారంటే రేవంత్ రెడ్డికి అంత కోపం ఎందుకు?: కేటీఆర్

అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై ప్రభుత్వ నిర్బంధాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు.జర్నలిస్ట్ అరెస్టును హరీశ్ రావు ఖండించారు. నిఘా వేసి, రెక్కీ నిర్వహించి అరెస్ట్ చేయడమేమిటని ప్రశ్నించారు. ఇది అప్రజాస్వామికమని ధ్వజమెత్తారు. ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే సంకెళ్లు వేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పులను ఎత్తిచూపితే అరెస్ట్ చేయడమేమిటన్నారు. అరెస్ట్ చేసిన జర్నలిస్ట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రధాని అబద్ధాలు చెప్పడం మానుకోకపోతే.. మేం నిజాలు చెబుతూనే ఉంటాం: సీఎం రేవంత్

తెలంగాణ రైతుల విషయంలో మోదీ విమర్శలకు సరైన సమాధానం ఇచ్చామన్నారు. తాను వివరాలు అందించాక ప్రదాని మోదీ తన ట్వీట్‌ను డిలీట్ చేశారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లోనే 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసినట్లు చెప్పారు. సామాజిక న్యాయం అందించేందుకు తెలంగాణలో కులగణన చేపట్టామన్నారు. 2025 జనగణనలో తెలంగాణ కులగణనను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. దేశ చరిత్రలో మహారాష్ట్రకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. మహారాష్ట్రకు రావాల్సిన 17 మెగా ప్రాజెక్టులు గుజరాత్‌కు వెళ్లాయన్నారు. మహారాష్ట్ర ప్రజలను మోసం చేసిన బీజేపీని వచ్చే ఎన్నికల్లో ఓడించాలన్నారు.

### తాము ఏం కోల్పోయారో ప్రజలకు అర్థమైంది:

ఇవాళ సిద్ధిపేటలో కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ లో చేరికలు జరిగాయి.పలువురు నేతలకు పార్టీలోకి స్వాగతం పలికిన కేసీఆర్...ఈ సందర్భంగా మాట్లాడుతూ, తాము ఏం కోల్పోయారో ప్రజలకు అర్థమైందని అన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చి 11 నెలలు గడిచాయని, ప్రభుత్వం అంటే అందరినీ కాపాడాలని స్పష్టం చేశారు.మాకు కూడా తిట్టడం వచ్చు... రౌడీ పంచాయితీలు చేయడం మాకు కూడా తెలుసు...అధికారం ఇచ్చింది తిట్టడానికి కాదు...ప్రజలు మీకు బాధ్యత ఇచ్చింది సేవ చేయడానికి అని కేసీఆర్ వ్యాఖ్యానించారు."మేం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల కంటే 90 శాతం ఎక్కువ హామీలు అడగకుండానే అమలు చేశాం.చేయలేనివి కూడా చేస్తామని చెప్పడం మాకు రాదు, తెలియదు. మాకు మాట్లాడడం రాదనుకున్నారా...ఇవాళ మొదలుపెడితే రేపటి వరకు మాట్లాడతా.ప్రజలను కాపాడాల్సింది పోయి భయపెడతారా?అధికారంలోకి రాగానే వాడ్ని లోపలెయ్యాలి, వీడ్ని లోపలెయ్యాలి అని ఆలోచిస్తారా?అరెస్టులకు భయపడేది లేదు.ప్రజలు మీకు అధికారం ఇచ్చింది బాధ్యతాయుతంగా ప్రజలకు సేవ చేయాలి. ప్రజలు అధికారం ఇచ్చింది కూల్చడానికి కాదు...నిర్మించడానికి. బీఆర్ఎస్ శ్రేణులు కంగారు పడాల్సిన పనిలేదు....మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనే. ట్రెండ్ చూస్తే... ప్రజలు బీఆర్ఎస్ పై విశ్వాసంతో ఉన్నారన్న విషయం అర్థమవుతోంది" అంటూ కేసీఆర్ వ్యాఖ్యానించారు.

## జమిలి ఎన్నికలు అసాధ్యం.. ప్రజలను గందరగోళం చేయొద్దు

జమిలి ఎన్నికల అంశాన్ని ముందుకు తెచ్చి ప్రజలను గందరగోళం చేయొద్దని తెలిపారు. మూడవసారి కేంద్రంలో బీజేపీకి మెజార్టీ రాలేదు.. మిత్ర పక్షాలపై ఆధారపడిందని పేర్కొన్నారు.అబద్ధపు పునాదుల మీద బీజేపీ ఎన్డీఏ ప్రభుత్వం నడుస్తోందని చాడ వెంకట రెడ్డి ఆరోపించారు.సహజ సంపద కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారు.. సహజ పరం చేయడం లేదని చాడ వెంకట రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 11 మాసాలవుతుంది ప్రభుత్వం ఏర్పాటు చేసి.. కొన్ని పనులు జరుగుతున్నా.. ఇంకా ఇచ్చిన హామీలు అమలు చేయాలని తెలిపారు. చిన్న చిన్న విషయాలలో రాష్ట్ర ప్రభుత్వం అభాసు పాలవుతుందని పేర్కొన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు గత ప్రభుత్వం రూ. 200 కోట్ల పైబడి బకాయిలను పెట్టింది.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 70% చెల్లించింది 30% చెల్లించాలి.. వాటిని కూడా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని చాడ తెలిపారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు సంబంధించిన బకాయిలను పూర్తిగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఖాళీ కడుపుతో జీలకర్ర నీళ్లు తాగితే అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు.. మిస్ చేసుకోవద్దు.!



జీలకర్ర నీళ్లు అనేది అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉండే సహజ వైద్య పద్ధతి. జీలకర్రలో ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండటం వల్ల ఇది శరీరానికి మేలు చేస్తుంది.జీలకర్రని నీటిలో నానబెట్టడం ద్వారా వాటి పోషకాలు నీటిలో కలుస్తాయి, దీన్ని ఉదయం ఖాళీ కడుపుతో తాగడం ద్వారా మంచి ప్రయోజనాలను పొందవచ్చు.

**జీలకర్ర నీళ్లు తాగితే కలిగే ఆరోగ్య ప్రయోజనాలు :** జీర్ణశక్తి మెరుగుదల: జీలకర్ర నీళ్లు జీర్ణ వ్యవస్థకు సహాయపడుతుంది. ఇందులో ఉండే థైమోల్ అనే పదార్థం జీర్ణరసాల ఉత్పత్తిని మెరుగుపరుస్తుంది, దీని వల్ల గ్యాస్ సమస్య, మలబద్ధకం మరియు మానసిక ఒత్తిడి తగ్గుతుంది.

**బరువు తగ్గడం :** జీలకర్ర నీళ్లు బరువు తగ్గడంలో సహాయపడే ఔషధ గుణాలను కలిగి ఉంటుంది. ఇది శరీరంలోని వ్యర్థాలను తొలగించడంలో సహాయపడుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో తాగడం ద్వారా మెటాబాలిజం వేగంగా పనిచేస్తుంది, ఇది కొవ్వు కరుగుదలలో సహాయపడుతుంది.

**యాంటీ ఆక్సిడెంట్ల సమృద్ధి :** జీలకర్రలో యాంటీ ఆక్సిడెంట్లు మరియు విటమిన్ ఇ ఉంటాయి, ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ని నాశనం చేస్తాయి. దీని వల్ల చర్మం కాంతివంతంగా, ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడుతుంది.

**ఇన్ఫెక్షన్ల నివారణ :** జీలకర్రలో యాంటీ మైక్రోబియల్ , యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి. దీన్ని రోజూ తాగడం ద్వారా శరీరంలో ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు. ముఖ్యంగా గుండెకు, లివర్‌కు రక్షణ కల్పిస్తుంది.

**ఇమ్యూనిటీ పెంపు :** జీలకర్రలో ఐరన్, విటమిన్ సి ఉంటాయి, ఇవి రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. ఇది శరీరాన్ని ఇన్‌ఫెక్షన్ల నుండి కాపాడుతుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది.

**చర్మానికి , జుట్టుకు మేలు :** జీలకర్రలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజాలు చర్మం మరియు జుట్టు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. జీలకర్ర నీళ్లు తాగడం వల్ల చర్మం మెరుస్తూ ఆరోగ్యంగా మారుతుంది, జుట్టు ముడతలు రాకుండా ఆరోగ్యంగా పెరుగుతుంది.

**మధుమేహ నియంత్రణ :** జీలకర్ర నీళ్లు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచడానికి సహాయపడుతుంది. ఇది మధుమేహంతో బాధపడుతున్న వారికి సహాయపడవచ్చు.

**జీలకర్ర నీళ్లను ఎలా తాగాలి :** జీలకర్ర నీళ్లను తయారు చేయడం చాలా సులభం. 1 టీస్పూన్ జీలకర్రను 1 గ్లాసు నీటిలో రాత్రి నానబెట్టాలి. ఉదయం ఆ నీటిని వడకట్టి ఖాళీ కడుపుతో తాగాలి. ఈ విధంగా తాగడం వల్ల మీరు ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. జీలకర్ర నీళ్లను మితంగా మాత్రమే తీసుకోవాలి. రోజూ తాగడమే కాకుండా వైద్యుల సూచనలను కూడా అనుసరించాలి.

# త్వరలో ప్రబోధిని ఏకాదశి.. తులసి వద్ద ఈ తప్పులు చేస్తే క్షమించనంటున్న లక్ష్మీదేవి!



ప్రబోధిని ఏకాదశి, దేవ ఉత్థాన ఏకాదశి కార్తీక మాసంలోని శుక్లపక్షం లోని 11వ రోజున వస్తుంది. ఈ ఏకాదశితో చాతుర్మాస కాలం ముగుస్తుంది. విష్ణు నిద్రించు నాలుగు నెలల చాతుర్మాస కాలం పూర్తయ్యే రోజున లక్ష్మీ స్వరూపమైన తులసికి వివాహ వేడుకను నిర్వహిస్తారు.శాస్త్రాల ప్రకారం విష్ణువు దేవ శయన ఏకాదశి రోజున నిద్రించి, మళ్ళీ ప్రబోధిని ఏకాదశి నాడు మేల్కొంటాడు.

**ప్రబోధిని ఏకాదశి నాడు తులసిమొక్క విషయంలో జాగ్రత్త**

అందుకే ప్రబోధిని ఏకాదశి శ్రీమహావిష్ణువు కోసం అంకితం చేయబడిన చాలా ప్రత్యేకమైన రోజుగా చెప్తారు. ఇక ప్రబోధిని ఏకాదశి నవంబర్ 12 వ తేదీన వస్తుంది. ఈ రోజున, హిందూ మతంలో చాలా ముఖ్యమైన తులసి మొక్క విషయంలో కొన్ని నియమాలు తప్పక పాటించాలి. ప్రబోధిని ఏకాదశి నాడు తులసి మొక్కకు నీరు పోయరాదు, ఎందుకంటే ఇది ప్రత్యేకమైన సమయం.

**తులసి మొక్క వద్ద ఈ తప్పులు చెయ్యొద్దు**

తులసి మహాలక్ష్మి స్వరూపం. విష్ణువు కోసం ఆమె ఈ రోజు నిర్జల వ్రతాన్ని ఆచరిస్తుంది. హిందూ విశ్వాసాలను అనుసరించే వ్యక్తులు తులసి చెట్టులో లక్ష్మి దేవత నివసిస్తుందని భావిస్తారు. కనుక తులసికి ఆగ్రహం తెప్పించే పనులు చెయ్యరాదు. దేవ ఉత్థాన ఏకాదశి అని పిలువబడే ప్రత్యేక రోజున, మీరు తులసి ఆకులను అస్సలు తుంచకూడదు . తులసిమొక్క నుండి ఆకులు తుంచటం ప్రబోధిని ఏకాదశి నాడు చాలా తప్పుగా పరిగణించబడుతుంది.

**తులసి ఆగ్రహిస్తే డబ్బు సమస్యలు**

బదులుగా, మీరు వాటిని ముందు రోజు తుంచుకోవచ్చు. మీరు తులసి మొక్క ఆకులను తుంచే ముందు, దానికి నమస్కరించడం ద్వారా గౌరవం చూపడం చాలా ముఖ్యం. మురికి చేతులు, కాళ్ళతో తులసి ఆకులను తాకవద్దు. అలా చేస్తే లక్ష్మి దేవి కలత చెందుతుంది. ఆమె ఆగ్రహించినప్పుడు, మీ కుటుంబానికి డబ్బు సమస్యలు రావచ్చు.

**తులసిని నిష్టగా పూజిస్తే లక్ష్మీ కటాక్షం**

తులసి మొక్క చుట్టూ మురికిగా ఉంటే, లక్ష్మీ దేవి మీ ఇంటిని వదిలి వెళ్ళవచ్చు. ప్రబోధిని ఏకాదశి నాడు తులసి మొక్క ఉన్న ప్రదేశం శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. ప్రబోధిని ఏకాదశి రోజున, తులసి మొక్క చుట్టూ పరిసరాలు కూడా శుభ్రంగా ఉండేలా జాగ్రత్త వహించాలి. అక్కడ దగ్గర చెప్పులు, బూట్లు విప్పకుండా చూసుకోవాలి. ప్రజలు ఆ రోజు తులసిని నిష్టగా పూజిస్తే లక్ష్మీ కటాక్షం ఉంటుంది

# ఆవు పాలు, గేదె పాలు ఏవి మంచిదో తెలుసా...?



ఆవు పాలు మరియు గేదె పాలు రెండూ తమదైన ప్రత్యేకతలు కలిగి ఉంటాయి. ఏది మంచిది అనే ప్రశ్నకు సమాధానం చెప్పడం కొంచెం కష్టమే. వ్యక్తిగత అవసరాలు, ఆరోగ్య పరిస్థితి మరియు ఇష్టాలపై ఆధారపడి ఉంటుంది.

**ఆవు పాల లాభాలు :** ఎముకలు మరియు దంతాల ఆరోగ్యానికి కాల్షియం చాలా ముఖ్యం. ఆవు పాలు కాల్షియం యొక్క అద్భుతమైన మూలం.శరీరం కణాల నిర్మాణానికి మరియు మరమ్మతుకు ప్రోటీన్ అవసరం. పాలు ప్రోటీన్ యొక్క మంచి మూలం.విటమిన్ డి, బి12, పొటాషియం వంటి అనేక ముఖ్యమైన విటమిన్లు మరియు ఖనిజాలు ఆవు పాలలో లభిస్తాయి.కొన్ని అధ్యయనాల ప్రకారం,పాలు తాగడం బరువు తగ్గడానికి సహాయపడుతుంది.పాలలో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది.

**ఆవు పాల నష్టాలు :** కొంతమందికి ల్యాక్టోస్ అనే చక్కెరను జీర్ణించుకోవడం లో ఇబ్బంది ఉంటుంది. ఇలాంటి వారికి పాలు తాగడం వల్ల అజీర్తి, వాయువు, అతిసారం వంటి సమస్యలు వస్తాయి.పూర్తి కొవ్వు పాలలో కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటుంది. ఇది హృదయ వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది.కొన్ని పాలలో గర్భధారణ హార్మోన్లు ఉంటాయి. ఇవి కొన్ని ఆరోగ్య సమస్యలకు కారణం కావచ్చు.కొంతమందికి పాల ప్రోటీన్లకు అలర్జీ ఉంటుంది.

**గేదె పాల లాభాలు మరియు నష్టాలు :** గేదె పాలు పోషకాలతో నిండి ఉన్నాయి మరియు వేలాది సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా వినియోగించబడుతున్నాయి.అయితే,ఇతర పాల వలె, గేదె పాలకు కూడా కొన్ని లాభాలు మరియు నష్టాలు ఉన్నాయి.

**గేదె పాల లాభాలు :** గేదె పాలలో కాల్షియం, ప్రోటీన్, విటమిన్లు మరియు ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యం, కండరాల అభివృద్ధి మరియు మొత్తం శరీర పనితీరుకు అవసరం.గేదె పాలలో ఉండే యాంటీబాడీలు రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయపడతాయి.గేదె పాలలోని ప్రోబయోటిక్స్ జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి మరియు కడుపు సంబంధిత సమస్యలను తగ్గిస్తాయి. గేదె పాలలోని ప్రోటీన్ శరీరాన్ని ఎక్కువసేపు నిండుగా ఉంచు తుంది,ఇది బరువు నిర్వహణకు సహాయపడుతుంది.

**గేదె పాల నష్టాలు :** గేదె పాలలో ఆవు పాల కంటే కొవ్వు శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది హృదయ సంబంధిత సమస్యలు మరియు బరువు పెరుగుదలకు దారితీయవచ్చు. ల్యాక్టోస్ అసహనం ఉన్నవారికి గేదె పాలు జీర్ణం కావు. ఇది వాయువు, ఉబ్బరం మరియు అతిసారం వంటి లక్షణాలకు దారితీస్తుంది. కొంతమంది వ్యక్తులకు గేదె పాల ప్రోటీన్లకు అలర్జీ ఉంటుంది. గేదె పాలలో కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉంటాయి, ఇది హృదయ సంబంధిత సమస్యలకు దారితీయవచ్చు.

**పిల్లలు: పిల్లలకు కాల్షియం అవసరం ఎక్కువ కాబట్టి ఆవు పాలు మంచి ఎంపిక :** పెద్దలు: ఎముకల ఆరోగ్యం కోసం గేదె పాలు మంచి ఎంపిక. అయితే, బరువు తగ్గాలనుకునే వారు ఆవు పాలను ఎంచుకోవచ్చు.ల్యాక్టోస్ అలర్జీ: ల్యాక్టోస్ అలర్జీ ఉన్నవారు ల్యాక్టోస్ ఫ్రీ పాలు లేదా వేరే ఆహారాల ద్వారా కాల్షియంను పొందవచ్చు.

**ముఖ్యమైన విషయాలు :** పశువుల ఆహారం: పశువులకు ఇచ్చే ఆహారం పాల పోషక విలువను ప్రభావితం చేస్తుంది.పాస్చరైజేషన్: పాలు పాస్చరైజ్ చేయడం వల్ల అనేక రకాల బ్యాక్టీరియా నశిస్తాయి.

# బైక్ సర్వీసింగ్‌లో ముఖ్యం బిగులు.. అస్సలు పొరపాటున కూడా తప్పుచేయ్యొద్దు

నేటి కాలంలో ఏ చిన్న పని చేసుకోవాలన్నా కనీసం 2-3 కిలోమీటర్లు గ్రామాల్లో ప్రయాణించాల్సి ఉంటుంది. అదే నగరాల్లో అయితే 5-10 కిలోమీటర్ల దూర ప్రయాణం సర్వ సాధారణంగా ఉంటుంది.పదుల కిలోమీటర్లు రోజూ ప్రజలు బైక్ పై ప్రయాణిస్తూనే ఉంటారు. పైగా రోజుకో మోడల్ స్కూటర్లు, బైక్స్ మార్కెట్లోకి వస్తున్న వేళ నచ్చిన మోడల్ కొంటూ ఉన్నారు. అందుకే ప్రతి ఒక్కరి ఇంట్లో కనీసం రెండు లేదా అంత కంటే ఎక్కువ బైక్స్ ఉంటున్నాయి. బైక్స్ కొనటం ఎంత ఇష్టంగా చేశారో వాటి నిర్వహణను సైతం ప్రజలు అంతే శ్రద్ధతో చేయకపోతే తర్వాత ఇబ్బందులు ఎదుర్కొంటారు. దీనికోసం ముందుగా ద్విచక్రవాహనాలను ఇంటివద్ద తరచుగా శుభ్రపరచుకోవటం ముఖ్యం.మనుషులకు మాదిరిగానే వాహనానికి కూడా ఆరోగ్యం చాలా ముఖ్యం. దీనిని నిర్వహించటానికి చాలా మంది బైక్ మెకానిక్స్ చెప్పేది వాహనానికి సరైన విధంగా మెయిన్టైన్ చేయటం. ఇందులో ముఖ్యమైనది స్కూటర్ లేదా బైక్ ఇంజన్ ఆయిల్ క్రమం తప్పకుండా మార్చుకోవటం. దీనికింద ప్రతి 2000 కిలోమీటర్లకు లేదా రెండు నెలలకు ఒకసారి బైక్ ఇంజన్ ఆయిల్ మార్చుకోవటం. ఇలా క్రమం తప్పకుండా చేయటం వల్ల బండి ఇంజన్ ఆరోగ్యకరంగా ఉంటూ స్మూత్ పర్ఫార్మెన్స్ అందిస్తుంది. ఇది బండి మైలేజీని మెరుగుపరుస్తుంది. క్రమం తప్పకుండా ఇంజన్ ఆయిల్ మార్చకపోవటం మైలేజీని తగ్గించే ముఖ్యమైన కారణాల్లో ఒకటిగా మెకానిక్స్ చెబుతుంటారు. అందుకే దీనికి అంత ప్రాముఖ్యత ఇవ్వబడింది. దీనికి తోడు సర్వీసింగ్ చేయించే ప్రతి సారి గుర్తుంచుకోవాల్సిన విషయం ఎయిర్ ఫిల్టర్ క్లీన్ చేయించుకోవటం లేదా కొత్తది మార్చుకోవటం. ఇది ఇంజన్ కంబషన్ సమయంలో గాలి సరఫరాను అందించటానికి చాలా ముఖ్యమైనదని వాహనదారులు గుర్తుంచుకోవాలి. వాహనాన్ని సర్వీసింగ్ చేయించుకునే సమయంలో అస్సలు చేయకూడని తప్పు ఒకటి ఉంది. దీనిని వాహనదారులు గుర్తుంచుకోవాలి. అదే బండికి సంబంధించి కార్బ్యురేటర్‌కి సంబంధించినది. బైక్ క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేయించే వ్యక్తులు



ప్రతిసారి దీనిని క్లీన్ చేయించాల్సిన అవసరం ఉండదని గుర్తుంచుకోవాలి. అందువల్ల అనవసరంగా సర్వీసింగ్ చేయించేటప్పుడు మెకానిక్ చెప్పినప్పటికీ కార్బ్యురేటర్ ఓపెన్ చేయకుండా ఉండటం మంచిది. బైక్ ముందుకు నడవటానికి అవసరమైన శక్తి ఇక్కడే తయారవుతుంది. పెట్రోల్ ట్యాంక్ నుంచి వచ్చే ఇంధనాన్ని గాలి సమపాళ్లలో కలిసేది ఇక్కడే. దీనిని అనవసరంగా ఓపెన్ చేయటం వల్ల అది బండి పనితీరును దెబ్బతీస్తుంటుంది. మైలేజీ భారీగా డ్రాప్ అయిన సందర్భాల్లో లేదా బండి పెట్రోల్ ఉన్నా ఆగిపోతున్న సమయాల్లో మాత్రమే మెకానిక్స్ కార్బ్యురేటర్ ఓపెన్ చేసి ఏదైనా నలకలు ఉంటే వాటిని శుభ్రం చేస్తుంటారు. అందువల్ల ఇటీవల బీఎస్-6 మోడల్ ద్విచక్రవాహనాల్లో కంపెనీలు కార్బ్యురేటర్ బదులుగా ఫ్యూయల్ ఇంజెక్ట్ ఇంజిన్ అందిస్తున్నాయి.మార్కెట్లో చాలా మంది ఇప్పటికి కార్బ్యురేటర్ ఉన్న పాత టెక్నాలజీ వాహనాలను వాడుతున్నందున దీని విషయంలో జాగ్రత్తగా ఉండటం మంచిది. రిపేర్ చేయటానికి ఓపెన్ చేసిన క్రమంగా డ్యామేజ్ అయితే అది లీకేజీలకు దారితీస్తుంది. ఇది ఇంజిన్ పనితీరుపై తీవ్ర ప్రభావితం చూపిస్తుంది. కొన్నిసార్లు కార్బ్యురేటర్ బిగించిన తర్వాత మెకానిక్స్ వాటిలో చిన్న చిన్న ఎడ్జెస్ట్మెంట్స్ చేస్తుంటారు. ఇంధనం లీక్ అయితే కార్బ్యురేటర్ తెరిచి మరమ్మత్తు చేయవలసి ఉంటుంది. ఇలాంటి సమస్య ఎదురైనప్పుడు వీలైనంత వరకు కంపెనీ సర్వీస్ టెక్నీషియన్ల వద్దకు వెళ్లటం ఉత్తమం. వారికి వాహనంపై పూర్తిగా అవగాహన ఉంటుంది కాబట్టి ఏదైనా పార్ట్ ఒకవేళ డ్యామేజీ అయితే దానిని జెన్యూన్ స్పేర్ పార్ట్ ఉపయోగించి రిపేర్ చేస్తారు. ఇది బండి దీర్ఘకాలిక పనితీరును మెరుగుపరుస్తుంది.

# వెల్లుల్లి రెబ్బ మరిగించిన పాలను ఒక్క గ్లాస్ తాగితే...

భారతీయులు ఎంతో పురాతన కాలం నుంచి వెల్లుల్లిని తమ ఆహారంలో భాగంగా ఉపయోగిస్తున్నారు. వెల్లుల్లి చక్కని వాసనను, ఘాటైన రుచిని కలిగి ఉంటుంది.దీన్ని మనం రోజూ వంటల్లో వేస్తుంటాం.అయితే ఆయుర్వేదంలో వెల్లుల్లికి ఎంతో ప్రాధాన్యతను కల్పించారు. దీన్ని అనేక వ్యాధులకు ఔషధంగా ఉపయోగిస్తారు. వెల్లుల్లి సహజసిద్ధమైన యాంటీ బయోటిక్గా పనిచేస్తుంది. అయితే రోజూ రాత్రి ఒక వెల్లుల్లి రెబ్బను వేసి మరిగించిన పాలను ఒక్క గ్లాస్ తాగితే చాలు.ఎన్నో లాభాలు కలుగుతాయి. ముఖ్యంగా పురుషులు ఇలా తప్పకుండా తాగాలి. ఈ విధంగా తాగడం వల్ల ఎలాంటి లాభాలు కలుగుతాయో ఇప్పుడు తెలుసుకుందాం.పాలలో వెల్లుల్లి రెబ్బను వేసి మరిగించి రాత్రి పూట భోజనం అనంతరం తాగాలి. దీని వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వెల్లుల్లిలో సహజసిద్ధమైన యాంటీ బయోటిక్, యాంటీ వైరల్ గుణాలు ఉంటాయి. కనుక రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. సీజనల్ వ్యాధులు తగ్గుతాయి. దగ్గు, జలుబు, జ్వరం నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. దీంతోపాటు ఆస్తమా నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది. ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉంటాయి. కఫం మొత్తం పోతుంది. శరీరంలో ఉండే కొలెస్ట్రాల్ కరుగుతుంది. దీని వల్ల రక్త నాళాలు శుభ్రంగా మారి.. హార్ట్ ఎటాక్లు రాకుండా ఉంటాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది.పాలు, వెల్లుల్లి రెబ్బ మిశ్రమాన్ని తీసుకోవడం వల్ల కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. కీళ్లు, మోకాళ్ల నొప్పులు, వాపులు తగ్గుతాయి.కనుక సమస్యలు ఉన్నవారు రోజూ దీన్ని తాగాల్సి ఉంటుంది.

# కొబ్బరి నీళ్లలో కొద్దిగా ఉప్పు కలిపి తాగితే శరీరానికి ఏమవుతుందో తెలుసా?



కొబ్బరి నీరు ప్రకృతిద్వారా అందించిన ఒక శుద్ధమైన, ఆరోగ్యకరమైన పానీయం. ఇది సహజసిద్ధమైన ఎలక్ట్రోలైట్స్, విటమిన్లు, ఖనిజాలు కలిగిన పానీయం కావడంతో ఆరోగ్యానికి చాలా మంచిది.కొబ్బరి నీరులో కొద్దిగా ఉప్పు కలిపి తాగడం కూడా ఆరోగ్యపరంగా కొన్ని ప్రయోజనాలు కలిగి ఉంటుంది, కానీ కొన్నిసార్లు దానికి ప్రతికూల ఫలితాలు కూడా కలగవచ్చు.

**ప్రయోజనాలు :** హైడ్రేషన్: కొబ్బరి నీరులో సహజసిద్ధమైన ఎలక్ట్రోలైట్స్ ఉండటం వల్ల ఇది శరీరాన్ని తక్షణమే హైడ్రేట్ చేస్తుంది. కొద్దిగా ఉప్పు కలపడం వల్ల శరీరం మరింత సమర్థవంతంగా నీటిని గ్రహిస్తుంది. ఇది వ్యాయామం తరువాత లేదా గరిష్ట వేడిలో బయట ఉన్నప్పుడు శరీరంలో తేమను తిరిగి పొందడంలో సహాయపడుతుంది.

**ఎలక్ట్రోలైట్ బ్యాలెన్స్ :** కొబ్బరి నీరులో ఉన్న పొటాషియం, సోడియం వంటి ఎలక్ట్రోలైట్స్ శరీరంలో సోడియం స్థాయిలను సమతుల్యం చేయడంలో సహాయపడతాయి. కొద్దిగా ఉప్పు కలపడం ద్వారా సోడియం స్థాయిని మరింత పెంచుకోవడం సాధ్యమవుతుంది, ఇది నీటిని తక్కువగా విడిచిపెట్టేలా చేయడంలో సహకరిస్తుంది.

**ఎసిడిటీ తగ్గించడం :** కొబ్బరి నీరు త్రాగడం వల్ల ఆమ్లాన్ని తగ్గిస్తుంది. కొద్దిగా ఉప్పు కలపడం వల్ల ఇది మరింత సమర్థవంతంగా పని చేస్తుంది. ఇది గ్యాస్ట్రిక్ సమస్యలను తగ్గించడంలో సహకరిస్తుంది.

**జీర్ణ ప్రక్రియకు సహాయం :** కొబ్బరి నీరు సహజంగా తేలికగా ఉండి జీర్ణ ప్రక్రియను సులభతరం చేస్తుంది. కొద్దిగా ఉప్పు కలపడం ద్వారా జీర్ణక్రియను పెంపొందించుకోవచ్చు, ఇది ఆహారాన్ని సరిగ్గా జీర్ణం చేయడంలో సహాయపడుతుంది.మానసిక ఉల్లాసం: కొబ్బరి నీరు హైడ్రేషన్‌తో పాటు, సహజమైన తీపి రుచి కలిగి ఉండటం వల్ల మానసికంగా రిఫ్రెష్‌గా అనిపిస్తుంది. కొద్దిగా ఉప్పు కలిపితే ఇది శరీరానికి తక్షణ శక్తినిచ్చే పానీయం అవుతుంది.

**నష్టాలు : బ్లడ్ ప్రెజర్ పెరగడం :** కొబ్బరి నీరులో తక్కువ మోతాదులో ఉప్పు చాలు. ఎక్కువగా ఉప్పు కలపడం వల్ల రక్తపోటు ఉన్న వారికి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. సోడియం అధికంగా తీసుకోవడం వల్ల రక్తపోటు పెరుగుతుందనే ప్రమాదం ఉంది.

**వయస్సుతో సంబంధం ఉన్న ఆరోగ్య సమస్యలు :** వృద్ధాప్యంలో ఉన్నవారు ఎక్కువగా ఉప్పు కలిపిన పానీయాలు తీసుకోవడం వల్ల మోకాళ్ళ నొప్పులు లేదా ఎడిమలు రావడం వంటి సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉంది.విరేచనాలు: కొబ్బరి నీరు సహజమైన డైయూరెటిక్ కావడం వల్ల, అధిక మోతాదులో తాగితే విరేచనాలు రావచ్చు. అలాగే, ఉప్పును మించికలిపితే ఈ సమస్య మరింత తీవ్రమవుతుంది.

**అధిక సోడియం వల్ల పొటాషియం లోపం :** కొబ్బరి నీరు సహజసిద్ధంగా పొటాషియం శాతం ఎక్కువగా కలిగి ఉంటుంది. కానీ అధికంగా ఉప్పు కలపడం వల్ల శరీరంలో సోడియం స్థాయి పెరిగి, పొటాషియం స్థాయి తగ్గే అవకాశం ఉంటుంది. ఇది శరీర తల్లడిల్లడానికి దారితీస్తుంది.

**రుచి ప్రభావం :** కొబ్బరి నీరులో ఎక్కువ ఉప్పు కలపడం వల్ల దాని సహజమైన తీపి రుచి తగ్గిపోతుంది. ఈ రుచి మార్పు కారణంగా కొబ్బరి నీరు త్రాగడంలో ఇష్టపూర్వకత తగ్గవచ్చు.సరియైన మోతాదులో కొబ్బరి నీరులో ఉప్పు కలిపి తాగడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది, కానీ మితిమీరితే దుష్ప్రభావాలు కలుగుతాయి. అందువల్ల, ఉప్పును తగిన మోతాదులోనే కలిపి తాగడం, అవసరమైనప్పుడు మాత్రమే కొబ్బరి నీరును వినియోగించడం మంచిదని భావించాలి.

# పరగడుపున నిమ్మరసం తేనె తాగుతున్నారా? ఒక్కక్షణం ఆగండి!



చాలామంది ఉదయం పరగడుపున నిమ్మరసం తేనే తాగుతూ ఉంటారు. అయితే నిమ్మరసం తేనె పరగడుపున తాగడం మంచిదేనా? నిమ్మరసం తేనె గ్లాసు వేడి నీళ్లలో కలుపుకొని ఉదయాన్నే తాగడం వల్ల ఏం జరుగుతుంది అనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం.ఉదయాన్నే నిమ్మరసం తేనే తాగడం మంచిదని పరగడుపున తాగితే బరువు తగ్గడానికి ఇది దోహదం చేస్తుందని చాలామంది చెబుతారు.

**ఉదయాన్నే పరగడుపున నిమ్మరసం, తేనె తాగుతున్నారా?**

అయితే ఖాళీ కడుపుతో నిమ్మరసం, తేనె కలిపి తాగితే ఆరోగ్యానికి మంచిది కాదని పలువురు ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారు. ఉదయాన్నే నిద్ర లేచిన తర్వాత పరగడుపున కాస్త గోరువెచ్చని నీళ్లను తాగాలని ఆ తర్వాత నిమ్మరసం తేనే తాగొచ్చని చెబుతున్నారు. ఖాళీ కడుపుతో నిమ్మరసం తాగడం వల్ల మన పొట్టలో యాసిడ్ పరిమాణం పెరుగుతుందని నిమ్మకాయలో ఉండే ఆమ్లా లక్షణాలు మన జీర్ణ వ్యవస్థపైన ప్రభావాన్ని చూపిస్తాయని చెబుతున్నారు.

**ఖాళీ కడుపుతో నిమ్మరసం, తేనె తాగితే ప్రమాదం :** ఖాళీ కడుపుతో నిమ్మరసం తాగడం వల్ల ఎముకల సమస్యలు, దంత సమస్యలు, డిహైడ్రేషన్ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని చెబుతున్నారు. తరచూ మూత్ర విసర్జన వంటి సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. కాబట్టి పళ్ళు తోముకుని మొదట రెండు గ్లాసుల నీళ్లు తాగాలాని చెప్తున్నారు.

**నిమ్మరసం తేనే తాగేవారు అనుసరించాల్సిన విధానం ఇదే :** ఆ తర్వాత ఒక గ్లాసు గోరువెచ్చని నీటిని తీసుకుని అందులో ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసాన్ని, ఒక టేబుల్ స్పూన్ తేనెను కలుపుకొని తాగితే మంచి ఫలితం ఉంటుందని చెబుతున్నారు. ఇక నిమ్మరసం తేనే తాగేవారు ప్రతిరోజు ఇదే విధానాన్ని అనుసరిస్తే మంచిదని శరీరంలో మెటబాలిజం పెరిగి అదనపు కొవ్వును కరిగించడానికి దోహదం చేస్తుందని చెబుతున్నారు.

**పరగడుపున నిమ్మరసం తేనె తాగేవారికి సూపర్ టిప్ :** ఇలా తాగినప్పుడు ఇది మన బరువును తగ్గించడానికి ఎంతగానో దోహదం చేస్తుందని సూచిస్తున్నారు. మన రోగనిరోధక శక్తి బలోపేతం కావడానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు చేకూరడానికి ప్రతి రోజు నిమ్మరసం తేనే తీసుకునేవారు ఖాళీ కడుపుతో నిమ్మరసంతో, తేనె తాగకుండా మొదట కొంత నీళ్లు తాగిన తర్వాత నిమ్మరసం తేనే తాగితే మంచిదని చెబుతున్నారు. ఇక ఈ చిన్న టిప్ ను పాటిస్తే మనకు జీర్ణ సంబంధమైన ఎటువంటి ఇబ్బంది కలగదని చెప్తున్నారు.

TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867
తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రిక
ఆదివారం 10 నవంబర్ - 2024

# ప్రముఖ నటి, ఎంపీ కంగనా రనౌత్ ఇంట తీవ్ర విషాదం



కంగనా రనౌత్ ఇంట ఇటీవల తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆమె అమ్మమ్మ ఇంద్రాణి ఠాకూర్ కన్నుమూసారు. ఈ విషయాన్ని కంగనా ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంటూ.. ఆమెతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అమ్మమ్మ ఇంద్రాణి ఠాకూర్ ఒక అద్భుతమైన మహిళ అని, ఐదుగురు సంతానాన్ని పెంచుతూ వారి విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ఎంతో కృషి చేసినట్టు కంగనా చెప్పుకొచ్చింది. కంగనా తన అమ్మమ్మ జీవితాన్ని ఎంతో గర్వంగా గుర్తు చేసుకుంటూ, ఆమె వయసు 100 సంవత్సరాలు అని, బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా మరణించినట్లు వెల్లడించారు.కంగనా రనౌత్ సినిమాలతో పాటు రాజకీయాల్లో కూడా చురుగ్గా వ్యవహరిస్తున్నారు.ఆమె వ్యాఖ్యలకు విపక్షాలతో పాటు రైతు సంఘాలు తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తం చేశాయి, దీనిపై ఆమె క్షమాపణ కూడా కోరారు. కంగనా తన రాజకీయ జీవితంలోనూ, సినిమాల వైపు దృష్టి సారిస్తూ, తన డైరెక్షన్‌లో రూపొందిస్తున్న "ఎమర్జెన్సీ" సినిమాను త్వరలో విడుదలకు సిద్ధం చేస్తున్నారు.

# సాయిపల్లవి.. నువ్వు గొప్ప నటివి: జ్యోతిక



'అమరన్' వీక్షించి సాయిపల్లవి పై నటి జ్యోతిక ఇటీవల ప్రశంసలు కురిపించిన విషయం తెలిసిందే.తాజాగా మరోసారి ఆమెను పొగడ్తలతో ముంచెత్తారు. ఆ చిత్రంలో ఆమె యాక్టింగ్‌ను మెచ్చుకున్నారు. దీనికి సంబంధించిన ఓ పోస్ట్ నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది.మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత కథను ఆధారంగా చేసుకుని రూపుదిద్దుకున్న చిత్రం 'అమరన్'. శివ కార్తికేయన్, సాయిపల్లవి జంటగా నటించారు. ఈ చిత్రాన్ని జ్యోతిక వీక్షించారు. సినిమా అద్భుతంగా ఉందని.. ముఖ్యంగా క్లైమాక్స్‌లో సాయిపల్లవి యాక్టింగ్ బాగుందంటూ ఇటీవల ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. దీనిపై సాయిపల్లవి స్పందించారు. "మీరు మా సినిమా చూస్తున్నారని టీమ్ చెప్పినప్పటి నుంచి మీకు నచ్చుతుందో లేదోనని నేనెంతో కంగారుపడ్డాను. మీ మాటలు నాకెంతో విలువైనవి. ఈ సినిమా మీకు నచ్చినందుకు ఆనందంగా ఉంది" అని చెప్పారు.ఈ పోస్ట్‌పై తాజాగా జ్యోతిక రిప్లై ఇస్తూ మరోసారి మెచ్చుకున్నారు. "సాయి.. నీ వర్క్ నాకు ఎప్పుడూ నచ్చుతుంది. నువ్వు గొప్ప నటివి. అద్భుతమైన పాత్రలు ఎంచుకోవడమే కాకుండా వాటికి సరైన న్యాయం చేస్తున్నావు. ఎల్లప్పుడూ నిన్ను ఇష్టపడుతూనే ఉంటా. 'అమరన్' క్లైమాక్స్‌లో నీ నటన అద్భుతంగా ఉంటుంది. అది నాకెంతో నచ్చేసింది. కెరీర్ పరంగా మరెన్నో ఉన్నత శిఖరాలు అందుకోవాలని కోరుకుంటున్నా" అని రాసుకొచ్చారు.రాజ్‌కుమార్ పెరియసామి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై కమల్ హాసన్ దీనిని నిర్మించారు. జీవీ ప్రకాశ్ స్వరాలు అందించారు. ఎన్నో అంచనాల మధ్య అక్టోబర్ 31న ఇది విడుదలైంది. విజయాన్ని అందుకుంది. మేజర్ ముకుంద్ వరదరాజన్ సతీమణి ఇందుగా సాయిపల్లవి నటన సినీ ప్రియులను కట్టిపడేసింది. ఇందులో భాగమైనందుకు ఆనందంగా ఉందని ఇప్పటికే ఆమె పలు సందర్భాల్లో తెలియజేశారు. ఈ సినిమా అవకాశం వచ్చినప్పుడు.. నా పాత్ర ఎలా ఉంటుంది? ఎంత నిడివి ఉంటుంది? అని ఎక్కువగా ఆలోచించలేదు. ఇది నాకు చాలా ముఖ్యం అనుకున్నా అంతే అని తెలిపారు.

# అలాంటి పాత్రలకు దూరంగా ఉంటాను: సమంత

'సిటడెల్: హనీ బన్నీ' వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకువచ్చి అందరినీ మరోసారి ఆకట్టుకున్నారు నటి సమంత. సినిమాల్లో మహిళల పాత్రల గురించి తాజాగా ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ..వారికి తక్కువ ప్రాధాన్యమిస్తున్నారన్నారు. మహిళలకు గుర్తింపువచ్చేలా చేయడం నటిగా తన బాధ్యత అని అన్నారు."ప్రేక్షకులు అన్ని విషయాలను గమనిస్తారు. అందుకే ఏం చేసినా బాధ్యతగా చేయాల్సి ఉంటుంది. నేను ఒక విషయానికి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు దానికి సంబంధించిన పూర్తి బాధ్యత నాపై ఉంటుంది. అందుకే పాత్రలను ఎంచుకునే సమయంలో ఎన్నో విషయాల గురించి ఆలోచించి ఎంపిక చేసుకుంటా. ప్రస్తుత సమాజంలో మహిళలకు న్యాయమైన ప్రాతినిధ్యం ఉండాలని భావిస్తున్నా. సినిమాల్లో కూడా రెండు, మూడు సన్నివేశాలకే పరిమితమయ్యే పాత్రలకు దూరంగా ఉంటాను. అలాగే నేను చేసే ప్రకటనల విషయంలోనూ ఆలోచిస్తాను. 'సిటడెల్: హనీ బన్నీ'లో నటించడం నాకు సవాలుగా అనిపించింది. హీరోకు సమానమైన పాత్ర. యాక్షన్ సన్నివేశాల్లోనూ హీరోతో సమానంగా చేశా. కానీ, ఇలాంటి అవకాశాలు అరుదుగా వస్తాయి. ఇలాంటి వాటికోసం నటీమణులు చాలామంది ఎదురుచూస్తున్నారు. నాకు ఎన్నో అవకాశాలు వచ్చినా.. కొన్నింటినే ఎంచుకున్నాను. నాకు వచ్చిన ఆఫర్లకు, నేను చేసిన సినిమాలకు మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది" అని సమంత చెప్పారు.బహిరంగంగా మాట్లాడాలంటే భయమేస్తోంది.. సహజీవనంపై '12th ఫెయిల్' హీరో కామెంట్స్సమంత నటించిన 'సిటడెల్: హనీ బన్నీ' ప్రస్తుతం 'అమెజాన్ ప్రైమ్ వీడియో' వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. ప్రియాంకా చోప్రా నటించిన హాలీవుడ్ సిరీస్ 'సిటడెల్'కు ఇది ఇండియన్ వెర్షన్. ఇందులో సమంత నటనపై సినీ ప్రముఖులు కూడా ప్రశంసలు కురిపించారు.

# ఇదే సౌండ్ నార్త్ ఇండియా మొత్తం వినపడాలి: రామ్‌చరణ్



రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన పొలిటికల్ యాక్షన్ డ్రామా 'గేమ్ ఛేంజర్'. కియారా అద్వాణీ కథానాయిక.దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకొంటోంది. ఈ సందర్భంగా శనివారం టీజర్ విడుదల వేడుకను లఖ్‌నవూలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామ్‌చరణ్, కియారా అద్వాణీ, ఎస్‌జే సూర్య, అంజలి, నిర్మాత దిల్‌రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ మాట్లాడుతూ.. 'RRR' మూవీని ఉత్తరాది ప్రేక్షకులు ఎంతో ఆదరించారని అన్నారు. 'గేమ్ ఛేంజర్'ను కూడా ఇలాగే ఆదరించాలని మీరు చూపిస్తున్న, ప్రేమ, అభిమానాలు నార్త్ ఇండియా మొత్తం వినపడాలని కోరారు. తన అభిమానులను కలుసుకోవడానికి మరో వేదిక ఉందని, అప్పుడు అందరినీ కలవనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకూ తన కెరీర్‌లో చేయని సరికొత్త పాత్రను 'గేమ్ ఛేంజర్'లో చేస్తున్నట్లు నటి అంజలి తెలిపారు. ఇదొక ఛాలెంజింగ్ పాత్ర అని పేర్కొన్నారు.ఇక మూవీ విషయానికొస్తే రామ్‌చరణ్ రెండు విభిన్న పాత్రల్లో కనిపించనున్నట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. శంకర్ ఇప్పటివరకూ టచ్ చేయని సబ్జెక్ట్‌తో రానున్నట్లు చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఆయన గత చిత్రాలకు ఏమాత్రం తీసిపోని విధంగా భారీదనం ప్రతి సన్నివేశంలోనూ కనిపిస్తోంది. ఇక తమన్ స్వరాలు సమకూర్చిన ఈ మూవీలో ఇప్పటికే విడుదల చేసిన 'జరగండి..', 'రా మచ్చా మచ్చా' పాటలు ట్రెండ్ అవుతున్నాయి. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు ఈ మూవీని నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 10న 'గేమ్ ఛేంజర్' విడుదల కానుంది. శ్రీకాంత్, ప్రకాశ్‌రాజ్, నాజర్, సముద్రఖని, జయరామ్, నవీన్ చంద్ర, సునీల్, సత్య తదితరులు నటిస్తున్నారు.

# ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్ ట్రైలర్ విడుదల..




ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్రీడమ్ ఎట్ మిడ్ నైట్ ట్రైలర్ విడుదలైంది! స్టూడియోనెక్స్ట్‌తో కలిసి ఎమ్మే ఎంటర్‌టైన్‌మెంట్ (మోనిషా అద్వానీ మధు భోజ్వానీ) నిర్మించారు, ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్‌లో తెర వెనుక ఒక అద్భుతమైన బృందం ఉంది.నిఖిల్ అద్వానీ ఈ ప్రాజెక్ట్‌కి షోరన్నర్ మరియు డైరెక్టర్‌గా నాయకత్వం వహిస్తుండగా, అభినందన్ గుప్తా, అద్వితీయ కరేంగ్ దాస్, గుందీప్ కౌర్, దివ్య నిధి శర్మ, రేవంత సారాభాయ్ మరియు ఏతాన్ టేలర్‌లతో సహా ప్రతిభావంతులైన బృందంఈ కథను అందించింది.లారీ కాలిన్స్ మరియు డొమినిక్ లాపియర్ రాసిన పేరులేని పుస్తకం ఆధారంగా, ఈ ధారావాహిక భారతదేశం యొక్క స్వాతంత్ర్య పోరాటం చుట్టూ ఉన్న గందరగోళ సంఘటనలను లోతుగా పరిశోధిస్తుంది. ఈ ధారావాహికలో జవహర్‌లాల్ నెహ్రూగా సిధాంత్ గుప్తా, మహాత్మా గాంధీగా చిరాగ్ వోహ్రా, సర్దార్ వల్లభాయ్ పటేల్‌గా రాజేంద్ర చావ్లా, ముహమ్మద్ అలీ జిన్నాగా ఆరిఫ్ జకారియా, ఫాతిమా జిన్నాగా ఇరా దూబే, సరోజినీ నాయుడుగా మలిష్కా మెండోన్సా,లిఖ్యా కుమారి రాజ్‌త్‌తో సహా నక్షత్ర తారాగణం నటించింది. అలీఖాన్, కె.సి.శంకర్ వి.పి. మీనన్, లార్డ్ లూయిస్ మౌంట్‌బాటన్‌గా ల్యూక్ మెక్‌గిబ్నీ, లేడీ ఎడ్వినా మౌంట్‌బాటెన్‌గా కార్డెలియా బుగేజా,ఆర్కిబాల్డ్ వేవెల్‌గా అలిస్టర్ ఫిన్లే, క్లెమెంట్ అట్లీగా ఆండ్రూ కల్లమ్, సిరిల్ రాడ్‌క్లిఫ్‌గా రిచర్డ్ టెవర్సన్ కీలక పాత్రల్లో నటించారు.కాగా,ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్‌తో మునుపెన్నడూ లేని విధంగా చరిత్రను ఆవిష్కరించడానికి సిద్ధంగా ఉండండి, నవంబర్ 15 నుండి సోనీ LIVలో మాత్రమే ప్రసారం అవుతుంది! ట్రైలర్ లింక్:




# 'ఆ సమయంలో అండగా నిలిచాడు'.. ఇంగ్లాండ్ ఆటగాడు బట్లర్‌పై చాహల్ ఎమోషనల్ పోస్టు



ఐపీఎల్ మెగా వేలానికి ఉత్కంఠగా ఎదురుచూసిన ఆటగాళ్ల రిటెన్షన్ లిస్ట్ వచ్చేసిన సంగతి తెలిసిందే.భారత స్టార్ స్పిన్నర్ యుజేంద్ర చాహల్ ను రాజస్థాన్ రాయల్స్ పెట్టుకోలేదు. ఆర్ఆర్ విడుదల చేసిన రిటెన్షన్ జాబితాలో ఇంగ్లాండ్ ఆటగాడు జోస్ బట్లర్ కూడా ఉన్నాడు. ఈ క్రమంలోనే బట్లర్‌ను ఉద్దేశిస్తూ.. చాహల్ ఎమోషనల్ పోస్టు పెట్టాడు.బట్లర్ తనకు ఎంతో అండగా ఉన్నారని అందులో పేర్కొన్నాడు. "2022లో అతను నాకు కేవలం జోస్ బట్లర్‌గా మాత్రమే తెలుసు. కానీ, 2024లో అతడు నా జోస్ భాయ్‌గా మారాడు. కష్ట సమయంలో ఎంతో అండగా నిలిచాడు. ఈ విషయం చాలా కొద్ది మందికి మాత్రమే తెలుసు. అందుకు ధన్యవాదాలు తెలుపుతున్నా. ఏదో ఒక రోజు తనతో కలిసి ఓపెనింగ్ చేస్తా" అంటూ యుజేంద్ర చాహల్ 'ఎక్స్' (ట్విటర్) వేదికగా పోస్టు పెట్టాడు. వీరిద్దరికి సంబంధించిన వీడియోను పంచుకున్నాడు. ఇది కాస్త నెట్టింట వైరల్‌గా మారింది.గత మూడేళ్లలో రాజస్థాన్ జట్టు రెండు సార్లు ప్లేఆఫ్‌లకు చేరుకోవడంలో వీరిద్దరూ కీలక పాత్ర పోషించారు. ఈ జట్టు ఫైనల్ వరకు వెళ్లింది. నాటి నుంచి నేటి వరకు వీరి స్నేహబంధం బలపడుతూ వచ్చింది. 2022 సీజన్‌లో బట్లర్ నాలుగు సెంచరీలతో సహా 863 పరుగులు చేశాడు. ఆర్ఆర్ తరఫున గత మూడు సీజన్లలో చాహల్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా అరుదైన ఘనత అందుకున్నాడు.

# రింకూ సింగ్‌కు న్యాయం చేస్తున్నామా..? బ్యాటింగ్ ఆర్డర్‌పై ఆకాశ్



దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌ను భారత్ ఘనంగా ఆరంభించింది. శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో సఫారీలపై అద్భుత విజయాన్ని అందుకుంది.అయితే, ఈ మ్యాచ్‌లో యువ బ్యాటర్ రింకూ సింగ్‌ను ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు పంపించడంపై భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా ఆశ్చర్యం వ్యక్తంచేశాడు. అతడి నైపుణ్యాలను టీమ్‌ఇండియా సరిగ్గా ఉపయోగించుకోవడం లేదని అభిప్రాయపడ్డాడు.తన యూట్యూబ్ ఛానల్‌లో దీనిపై భారత జట్టు యాజమాన్యానికి ఆకాశ్ పలు ప్రశ్నలు సంధించాడు. "మనం రింకూకు న్యాయం చేస్తున్నామా? ఈ ప్రశ్న ఎందుకు అడుగుతున్నానంటే.. అతడిని మీరు జట్టులోకి తీసుకున్నారు. బంగ్లాదేశ్‌పైనా ఆడించారు. టాప్ ఆర్డర్‌లో పంపించినా.. పవర్ ప్లేలో బ్యాటింగ్ చేయించినా అతడు పరుగులు నమోదు చేశాడు. ప్రతిసారీ మంచి స్ట్రయిక్ రేట్‌తో అర్ధశతకం సాధిస్తూనే ఉన్నాడు. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకుంటూనే ఉన్నాడు. అలాంటప్పుడు అతడిని నంబరు 4లో ఎందుకు పంపించకూడదు?నిన్నటి మ్యాచ్ లో అతడిని ఆరో స్థానంలో ఎందుకు పంపించాల్సి వచ్చింది?రింకూ కేవలం ఫినిషర్ మాత్రమే కాదు. గేమ్‌ను ఎలా మలుపు తిప్పాలో అతడికి తెలుసు. భారీ హిట్టింగ్‌లూ చేయగలడు" అని ఆకాశ్ చోప్రా వివరించాడు.దక్షిణాఫ్రికాతో తొలి టీ20లో ఆరో స్థానంలో వచ్చిన రింకూ సింగ్ కేవలం 10 బంతులు ఎదుర్కొని 11 పరుగులు చేశాడు. అతడిని టాప్ ఆర్డర్‌లో పంపిస్తే భారత్ స్కోరు మరింత పెరిగేదని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. ఇక, తొలి టీ20లో భారత్ 202 పరుగులు చేయగా.. ఆతిథ్య సఫారీ జట్టు 141 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో 61 పరుగుల తేడాతో నెగ్గిన టీమ్ ఇండియా సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సాధించింది. నవంబరు 10న రెండో టీ20 మ్యాచ్ జరగనుంది.

# 'కేఎల్‌ను పక్కన పెట్టాలి.. ధ్రువ్‌ను ఆడించాలి': నెట్టింట డిమాండ్లు



ఆ ఇద్దరు ఆస్ట్రేలియా Aతో జరిగిన అనధికారిక టెస్టు ఆడేందుకు బరిలోకి దిగారు. ఒకరేమో అద్భుత ఫామ్‌తో జట్టును కాపాడేందుకు ప్రయత్నించగా..మరొకరు దారుణ ప్రదర్శనతో విమర్శలు ఎదుర్కోవడం విశేషం. ఇక్కడ బాగా ప్రాక్టీస్ చేసినవారికి బోర్డర్ – గావస్కర్ ట్రోఫీలో ఆసీస్‌తో ఆడే ఛాన్స్ వస్తుంది. అయినా నిర్లక్ష్యంగా వ్యవహరించిన భారత సీనియర్ ఆటగాడిపై నెట్టింట తీవ్రస్థాయిలో విమర్శలు రేగుతుండగా.. యువ బ్యాటర్ ధ్రువ్ జురెల్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. వీరిద్దరూ టెస్టు స్క్వాడ్‌లో ఉన్నవారే కావడం గమనార్హం. ఆసీస్‌తో తొలి టెస్టు పెర్త్ వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్ బరిలోకి దిగే తుది జట్టులో కేఎల్ రాహుల్‌కు అవకాశం ఇవ్వొద్దని.. ధ్రువ్‌ను ఆడించాలనే డిమాండ్లు పెరిగాయి. ఆస్ట్రేలియా Aతో, రెండో అనధికారిక టెస్టులో భారత్ A ఓడిపోయినా ధ్రువ్ మాత్రం రెండు హాఫ్ సెంచరీలు సాధించి ఆకట్టుకున్నాడు. మరోవైపు కేఎల్ ఓపెనర్‌గా వచ్చి 4, 10 పరుగులు మాత్రమే చేశాడు.కేఎల్ ఇలాగైతే కష్టమే..ఆస్ట్రేలియా Aతో ఆడిన భారత స్క్వాడ్‌లో కేఎల్ రాహుల్ సీనియర్. అతడే జట్టును ముందుండి నడిపించాలి. కానీ, క్రీజ్‌లోకి వచ్చినప్పటినుంచి ఇబ్బందిపడుతూనే ఉన్నాడు. పేస్, స్పిన్ అనే తేడా లేకుండా తడబాటుకు గురవడం అభిమానులను మరింత నిరాశకు గురిచేస్తోంది. భారత జట్టు మిడిలార్డర్‌లో పోటీ తీవ్రంగా ఉంటున్న క్రమంలో కేఎల్ మాత్రం వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం లేదు. చివరికి ప్రసిధ్ కృష్ణ (14, 29) వంటి బౌలర్ కూడా రెండు ఇన్నింగ్స్‌లోనూ కీలక పరుగులు చేశాడని.. కేఎల్ సీనియార్టీ ఏమైందో అర్థంకావడం లేదంటూ విమర్శలు వచ్చాయి. మరోవైపు ధ్రువ్ రెండు హాఫ్ సెంచరీలతో అదరగొట్టాడు. ఓపెనర్‌గానైనా కేఎల్ నాణ్యమైన క్రికెట్ ఆడతాడని భావిస్తే.. అక్కడా తేలిపోయాడు. కొత్త బంతిని ఎదుర్కోవడంలో ఇబ్బందిపడిన అతడు.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం కాసేపు క్రీజ్‌లో నిలబడ్డాడు. కానీ, పరుగులపరంగా మాత్రం పెద్ద తేడా ఏమీ లేదు.అతడి భవితవ్యంతో పాటు..ఆసీస్ టెస్టు సిరీస్‌తో భారత ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ అవకాశాలు ఆధారపడి ఉన్నాయి. న్యూజిలాండ్‌తో మూడు టెస్టుల సిరీస్‌ను టీమ్‌ఇండియా ఓడిపోయి చిక్కుల్లో పడేసింది. ఇప్పుడు ఆసీస్‌తో అయిదు టెస్టుల సిరీస్‌ను4-0 తేడాతోనైనా గెలిస్తేనే భారత్ ఆశలు సజీవంగా ఉంటాయి. అంతేకాక ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ 'టెస్టు కోచ్' భవితవ్యం కూడా తేలిపోతుందనే వార్తలు వస్తున్నాయి. ఈ సిరీస్ ఓడితే మాత్రం గంభీర్‌కు బదులు టెస్టులకు మరో కోచ్‌ను తీసుకొచ్చే ఛాన్స్ ఉందనే క్రికెట్ వర్గాల్లో చర్చ మొదలైంది. ఈ సమయంలో కేఎల్ తన అవకాశాలు వృథా చేసుకుంటే జాతీయజట్టులో చోటు దక్కడమూ కష్టమనే ప్రచారం సాగుతోంది.

PMR Publication,Thurkayamjal 4-136/12, 9100900918




తెలంగాణ
శాసనసభ
తెలుగు దినపత్రిక
జిల్లా అనుబంధం
ఆదివారం 10 నవంబర్ - 2024 | పేజీలు : 4

# స్ఫూర్తి

## తెలుగు సూర్యుడు

మహాకవి వేమనను లోకానికీ
పరిచయం చేసిన పరిశోధక బ్రహ్మ
నిఘంటువుల నిర్మాణ మెలకువలు
పండితులకే నేర్పిన పండితశ్రేష్ఠుడు
శైవ వాఙ్మయానికీ వెలుగు దారి
చూపించిన మిత్ర దార్శనికుడు
రవి అస్తమించని ఆంగ్ల సామ్రాజ్యమున
ఉదయించిన తెలుగు దివ్వె బ్రౌన్ దొర

మాతృభాష కన్న తెలుగును
అమితముగా ఆరాధించినాడు
వాగ్దేవి కీ అభేధ రూపముగా నిలిచాడు
తెలుగు సాహిత్య పర్ణశాలకీ రక్షకుడు
అంధకార బంధుర ఆంధ్రానికీ
వెలుగులు నింపిన మార్తాండుడు
తెలుగు జాతి అదృష్ట రత్నం బ్రౌన్ దొర

శకట రేఫ,అర్ధానుస్వారాల నాడి పట్టి
వ్యవహారానికీ ఊతమిచ్చినాడు
చెదరతున్న సారస్వత భస్మ రాశులకీ
మోక్షపదం చూపిన అపర భగీరథుడు
తాళపత్ర శిథిలాక్షరాలను
శిలా శాసనము గావించిన
మనకాలాపు మహా దార్శనికుడు బ్రౌన్దొర

గానట బీసట అక్షరాలను సరళం గావించి
జనరంజకం చేసిన సరస్వతి పుత్రుడు
కవిత ప్రపంచమున కదలినాడు

కమనీయ తెలుగు వికాసానికీ
తరతరాలుగా బూజు పట్టిన పోత్తమును
సముద్ధరించిన భాషోద్ధారక భాగీరథి
తెలుగు వారి నిత్య స్మరణీయుడు బ్రౌన్ దొర

భరతభూమి మొలకెత్తకున్న
తెలుగు నేలలో విస్తరించిన
సాహితోద్ధారక వృక్షరాజ్యం
తెలుగు మాగాణాన్నీ పులకరింపజేసి
సారస్వత తోట కృషివలుడు బ్రౌన్ దొర

ఆశయ సూర్యుడిగా అహర్నిశలు
సారస్వత సంస్కరణ యే ధ్యేయముగా
ఆర్థిక భారముతో సతమతమైన
మొక్కవోని పట్టుదలతో కదలిన సాహితీ కర్ణుడు
అస్థిర జానపద గేయానికీ
మర్దన చేసిన చలనమందించిన
చైతన్య ధన్వంతరి బ్రౌన్ దొర

కనుమరుగవుతున్న కావ్య సంపదకీ
కావలి కాసి నిల్వ చేసినాడు
కుమిలిపోతున్న తెలుగుభారతీ కీ
కనకాభిషేకముతో కీర్తి పెంచినాడు
శతాబ్ది కొక్క కవి శిఖరాగ్రి సమానుడు
యుగ యుగాలలోనొక్కడైన సాటి రాగలరే
సి. పి. బ్రౌన్ సారస్వత సేవకీ

డా. ఐ.చిదానందం
చరవాణి - 8801444335

# గురునానక్ యూనివర్సిటీ లో ఘనంగా జరిగిన ఓరియెంటేషన్ డే వేడుకలు







**ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 9 :** ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ యూనివర్సిటీ అల్లైడ్ సైన్సెస్ గురునానక్ హోమియోపతిక్ మెడికల్ కాలేజీ,హాస్పిటల్ సంయుక్తంగా 2024 - 2025 విద్య సంవత్సరానికి నూతన విద్యార్థులు, వారి తల్లి తండ్రులతో విశ్వవిద్యాలయ యాజమాన్యం పరిచయ సమావేశాన్ని (ఓరియెంటేషన్ డే) నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ చారబుద్ది శ్రీనివాస రెడ్డి (ఏం డి - హోమియో) ప్రిన్సిపాల్ (ప్రొఫెసర్ , హెచ్ ఓ డి) ప్రభుత్వ హోమియోపతిక్ మెడికల్ కాలేజీ, హైదరాబాద్, డాక్టర్డా ఆశిష్ చౌహాన్, ప్రఖ్యాత షుగర్ వ్యాధి నిపుణులు మరియు వక్త, డాక్టర్ డి రాజేష్ రెడ్డి , హెచ్ ఓ డి ఫీజియోథెరఫీ, యశోద హాస్పిటల్స్ విచ్చేసి విద్యార్థులు మరియు వారి తల్లి తండ్రులతో వారి వైద్య విద్యా అనుభవాన్నితెలియ చేస్తూ వైద్య విద్య అనేది మానవత్వ విలువలతో కూడిన ఉన్నత విద్య అని విద్యార్థులు క్రమశిక్షణ పట్టుదల నిజాయితీతో వైద్య విద్యను అభ్యసించి భవిష్యత్తులో వైద్య రంగంలో నిష్ణాతులు కావాలని సూచించారు. వైద్య విద్యార్థులు సామజిక దృక్పథం కలిగి ఉండి సేవాభావంతో మంచి వైద్యులుగా ప్రజలకు మంచి సేవలు అందిస్తూ గుర్తింపు తెచ్చుకోవాలని వారు విద్యార్థులకు దిశా నిర్దేశం చేసారు. అలోపతి వైద్యం కంటే హోమియో వైద్యం ద్వారా ఎటువంటి హాని కలగకుండా వైద్యం అందించి ఎలాంటి రోగాలైన నయం చేయవచ్చని ఖర్చు కూడా చాలా తక్కువ అవుతుందని వివరించారు. ప్రస్తుత పరిస్థితులలో ప్రజలు అలోపతి మందులు ఆర్థిక భారం వల్ల కొనలేక పోతున్నారని దానికి ప్రత్యాన్మాయంగా హోమియో మందులు వాడుతున్నారని వివరించారు. ప్రస్తుత కాలంలో డయాబెటిస్, క్యాన్సర్, బిపి, గుండె సంబంధిత వ్యాధులు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని వీటిపై గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచిస్తూ గ్రామాలలో విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు చేపట్టి ప్రజలను చైతన్యవంతులను చేయాలనీ సూచించారు.

ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ చైర్మన్ మరియు గురు నానక్ విశ్వ విద్యాలయ ఛాన్సలర్ జి ఎస్ కోహ్లి అతిధులకు సన్మాన కార్యక్రమాన్ని జరిపి కార్యక్రమానికి విచేసినందుకు వారికి కృతజ్ఞతలను తెలియచేసి, సమావేశాన్ని ఉద్దేశిస్తూ తమ విశ్వవిద్యాలయంలో చదివి భవిష్యత్తులో మంచి వైద్య నిపుణులుగా ఎదిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అందుకు తల్లి తండ్రులు తమ పిల్లలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందించాలని విద్యార్థులకు వారి తల్లి తండ్రులకు సూచించారు. విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ మరియు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్ ఎస్ సైని మాట్లాడుతూ విద్యార్థులు వారి కెరీర్ లో ఉన్నత విజయాలు సాధించేలా అందుకు అనుగుణంగా వారి వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించి భవిష్యత్తులో నూతన ఆవిష్కరణలను ఆవిష్కరించే దిశగా తమ సంస్థ అనుభవజ్ఞులైన అధ్యాపకుల పర్యవేక్షణలో విద్యార్థులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్లై టి శ్రీనివాసులు, డాక్టర్ ఎస్ శ్రీనాథ రెడ్డి, డైరెక్టర్, డాక్టర్ సంజీవ్ శ్రీవాస్తవ, డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పార్థసారధీ ,హోమియోపతి కాలేజీ ప్రిన్సిపాల్ %a% సూపరింటెండెంట్ డాక్టర్ రేణుక బి వై , అల్లైడ్ సైన్సెస్ విభాగం డీన్, ఇంచార్జి డైరెక్టర్ మరియు ఈవెంట్ కన్వీనర్ డాక్టర్ అపర్ణ, డాక్టర్ దేబడిష్ పాండా, సంబంధిత ఇతర విభాగ అధిపతులు సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

### - ఇంజాపూర్ విద్యుత్ ఏఈ రాములు.

**తుర్కయంజాల్, శాసనసభ న్యూస్ నవంబర్ 9 :** తుర్కయాంజల్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమం చేపటడుతున్నందున స్వల్ప వ్యవధిలో విద్యుత్ సరఫరాకు ఆదివారం నాడు అంతరాయం కలుగుతుందని ఇంజాపూర్ విద్యుత్తు ఏఈ రాములు శనివారం నాడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుర్కయంజాల్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11కెవి కమ్మగూడ ఫీడర్ లోని కమ్మగూడ,ఈస్ట్ సూరజ్ నగర్,సుభాష్ నగర్, శాంతి నగర్,రాజ రంజిత్ హోమ్స్,నవ భారత్ కాలనీ, అపాట్ కాలనీ,ఆర్టీసీ కాలనీ,వశిష్ట ,టీచర్స్ కాలనీ,సెంట్ పాల్స్ స్కూల్ లల్లో సోమవారం ఉదయం 11గంటల నుండి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.చెట్ల కొమ్మలలు



తొలగించడం తో పాటు చిన్న చిన్న నిర్వహణ మరమత్తు పనుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని సూచించారు. ఈ విద్యుత్ అంతరాయమునకు వ్యాపారస్తులు, వ్యవసాయదారులు, ప్రజలు,విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

# దళారుల మాటలు విని..రైతులు మోసపోవద్దు

**డి ఆర్ డి ఎ పిడి లలిత**
**ఏ గ్రేడ్ 2320 రూ “**
**సాధారణ గ్రేడ్ 2300 రూ**
**చింతపట్ల, నంది వనపర్తి లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు**
**సూరం భాస్కర్ రెడ్డి ధాన్యాన్ని పరిశీలించిన వ్యవసాయ అధికారులు**





**యాచారం శాసనసభ న్యూస్ ( నవంబర్ 09):.** రైతులు దళారుల మాటలు విని మోసపోవద్దని పిడి లలిత అన్నారు. శనివారం ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకే వరి ధాన్యం, కొనుగోలు కేంద్రాలు చింతపట్ల,నంది వనపర్తి గ్రామలలో ఏర్పాటు చేశారు. ఏ రకం 23 20 రు. సాధారణ గ్రేడ్ 2300 రూ. రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వరి ధాన్యం తడి లేకుండా చేసుకోవాలని సూచనలు చేశారు. పచ్చి సర్కులను తెచ్చుకుని ఇబ్బంది పడవద్దు అని రైతులతో మాట్లాడారు. బాగా ఆరిన వరి ధాన్యాన్ని మార్కెట్ కు తీసుకురావాలని కోరారు.చింతపట్ల గ్రామంలో మాజీ వార్డ్ నెంబర్ సూరం భాస్కర్ రెడ్డి వరి ధాన్యాన్ని అగ్రికల్చర్ ఆఫీసర్ రవినాథ్, ఎంపీడీవో నరేందర్ రెడ్డి పరిశీలించారు. ఐకెపి సిబ్బంది రైతులకు సహకరించాలని కోరారు. లేనియెడలో ప్రభుత్వపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం సుదర్శన్ రెడ్డి, సీసీ నరసింహ, ఏఈఓ వసంత, రమేష్, సంతోష్, గ్రామపంచాయతీ సెక్రటరీ రవికుమార్ రెడ్డి, స్వరూప, నరసింహారెడ్డి, జోగిరెడ్డి, గ్రామ సంఘం, పాలకవర్గ సభ్యులు, వివో ఏ జ్యోతి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్న ఏమ్యునరెటర్లు





**చండూర్ నవంబర్ 9 (శాసనసభ న్యూస్) :** శనివారం రోజున కిష్టాపురం, ఇప్పర్తి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కుల గణన, సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి తిరిగి ఎమ్యునరెటర్లకు పూర్తి వివరాలు అందించి వివరాలు నమోదు చేయించుకోవాలని అవగాహన కల్పిస్తున్న మునుగోడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమనపల్లి సైదులు .ఈ కార్యక్రమంలో ఏమ్యునరేటర్లు పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, లింగస్వామి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# కారు ,బైక్ ఢీకొనడంతో బాలుడు మృతి
## బైకు వాహనదారుడు రవికి తీవ్ర గాయాలు
## ఆస్పత్రికి తరలింపు,

**యాచారం మేజర్ న్యూస్ (నవంబర్ 09):.** ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం యాచారం మండల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ ఏ నరసింహారావు వివరాల ప్రకారం..కొత్తపెల్లి గ్రామానికి చెందిన కొండ్రెడ్డి యాదయ్య కుమారుడు రామ్ చరణ్ (15) తన తాత వద్దకు వెళ్తున్నానని మాల్ లో లిఫ్ట్ అడిగి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు.తమలోని గూడ సమీపంలో కరెంటు సబ్ స్టేషన్ వద్ద ఎదురుగా అతివేగంగా కారు బైకు కొనడంతో అక్కడికక్కడే బాలుడు మృతి చెందాడు. చింతపట్ల గ్రామానికి చెందిన రవి ( 35) బైకు వాహనదారుడు అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వైద్యం నిమిత్తం స్థానిక 108 అంబులెన్స్ సహకారంతో మాల్ లైఫ్ స్టైల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# సిపిఎం బహిరంగ సభను జయప్రదం చేయండి
## - బొట్టు శివకుమార్

**చండూర్ నవంబర్ 9 శాసనసభ న్యూస్):** శనివారం రోజున జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు తేరట్ పల్లి గ్రామ శాఖ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వద్ద సిపిఎం జిల్లా మహాసభలు డిసెంబర్ 2 ,3, 4 న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయండి. కరపత్రం ఆవిష్కరణ ముఖ్యఅతిథిగా సిపిఎం మాజీ మండల కార్యదర్శి చండూర్ బొట్టు శివకుమార్ హాజరై మాట్లాడుతూ ఈ దేశంలో ప్రజా సమస్యల పైన అనునిత్యం పోరాటం చేసేది సిపిఎం ప్రజలకు ఏ సమస్య వచ్చినా పోరాటం చేసే పార్టీ కమ్యూనిస్టులు ముందంజలో ఉంటారని డిసెంబర్ 2న మిర్యాలగూడ లో జరిగే భారీ బహిరంగ సభను ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రజా పునాదిలో ఉ ద్యమ బాటలో ఆనాటి నుండి నేటి వరకు కమ్యూనిస్టులు ప్రజల సమస్యల పైన నిత్యం పోరాటం చేసే కమ్యూనిస్టుల గడ్డయిన మిర్యాలగూడలో జరిగే బహిరంగ సభ జయప్రదం కోసం ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై నడుము కట్టి ఎర్ర చొక్కాలతో ఎర్ర చీరలతో



ఎర్ర దండు గ్రామ గ్రామాన వాడ వాడల ఎర్ర దండై కదిలి బహిరంగ సభ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కార్యకర్తలకు ప్రజలకు పిలుపునిచ్చారు. భవిష్యత్తు ఉద్యమంలో ప్రతి ఒక్కరు పాల్గొని కమ్యూనిస్టు గడ్డగా నల్లగొండ జిల్లా ఉద్యమాల చరిత్ర కలిగిన గడ్డమీద ప్రతి ఒక్కరు ముందుండి పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఆచ్చిన శ్రీనివాసులు, వల్లూరి శ్రీశైలం, బిజిలి రాములు, గిరి భిక్షం, గిరి వెంకటేష్, పబ్బు లింగస్వామి, పబ్బు రామస్వామి, తదితరులు పాల్గొన్నారు

# గీత కార్మికుల ఉపాధి కై చర్యలు చేపట్టండి
## - యం.వి.రమణ

**చండూర్ నవంబర్ 9 శాసనసభ న్యూస్):** రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని వీరి ఉపాధి మెరుగుపడే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు యం.వి రమణ అన్నారు. శనివారం రోజున చౌటుప్పల్ పట్టణంలోని కంఠ మహేశ్వరుడి ఆలయం వద్ద జరిగిన సంఘం ముఖ్యుల సమావేశంలో ఉపాధ్యక్షులు



బొలగాని జయ రాములు, వి వెంకట నర్సయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు రాగిర్ కృష్ణయ్య ల తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తిలో ఉపాధి మెరుగు పడాలంటే ప్రధానంగా చెట్ల పెంపకానికి భూమి ఇవ్వాలని, కల్లు కు మార్కెట్ సౌకర్యం కల్పించాలని, నీరా తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని. ప్రతి గీత కార్మికుడికి మోటార్ సైకిళ్ళు పంపిణీ చేయాలని. కల్లు గీత కార్మికుడు సహజ మరణం పొందిన గీత కార్మికునికి 5 లక్షల రూపాయలు ఇచ్చేలా గీతాన్న బీమా పథకం అమలు చేయాలని. ప్రతి గీత కార్మికుడు కుటుంబానికి రెండు లక్షల రూపాయల సబ్సిడీ రుణం ఇవ్వాలని అన్నారు. ప్రకృతి పానీయం స్వచ్ఛమైన కల్లు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైందని దీనిని ఆధునిక పద్ధతుల ద్వారా ప్రజలకు అందజేయాలని తద్వారా గీత కార్మికుల ఉపాధి మెరుగు పడుతుందని అన్నారు.యాదాద్రి భువనగిరి జిల్లాలోని నందనం లో గత ప్రభుత్వ హయాంలో నీరా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి 8 కోట్ల బడ్జెట్ కేటాయించడం జరిగిందని, బిల్డింగ్ నిర్మాణం పూర్తయిందని అందుకు సంబంధించిన మిషనరీని నిర్మాణం చేశారన్నారు.కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనము, మిషనరీ నేడు పడావు పడి ఉందనీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వము వెంటనే జోక్యం చేసుకొని తగిన నిధులు కేటాయించి ఈ కేంద్రాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ఐదు ఎకరాలు టాడి కార్పొరేషన్ కు సంబంధించిన భూమి ఉన్నది. విస్తారంగా తాటి ఈత చెట్లు ఉన్నాయి. దీని మిగతా పనుల కోసం తగిన బడ్జెట్ కేటాయించి టాడి కార్పొరేషన్ కు అప్పగించాలి అన్నారు. నీరా, తాటి, ఈత అనుబంధ ఉత్పత్తులు ఇక్కడ తయారవుతాయి. హైదరాబాదు నెక్లెస్ రోడ్ లోని నీరా కేఫ్ కు, వివిధ ప్రాంతాలకు సమృద్ధిగా నీరా ను బాటిలింగ్ చేసి పంపిణీ చేయవచ్చు. బుట్టలు, బ్యాగులు, దండలు తదితర ఫ్యాన్సీ వస్తువులను తయారుచేసి మార్కెటింగ్ చేయవచ్చు. ఫలితంగా గీత కార్మికులకి ఉపాధి కలుగుతుందని అన్నారు.బిసి సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ తక్షణమే జోక్యం చేసుకొని పనులు పూర్తి చేసి ప్రాజెక్టును ప్రారంభించాల్సిందిగా కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో చౌటుప్పల్ గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు చింతకింది అంజయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల లక్ష్మయ్య, ఊడుగు శ్రీనివాస్, ఊడుగు మల్లేశం, కాసం వెంకటేశం, తూర్పునూరి వెంకటేశం, పాలకూర స్వామి, వర్గాల రవి, ముద్దాల రాములు, రాజపేట అశోక్, చౌగోని వెంకటేశం, తూర్పునూరు మల్లేష్, ఉ స్కాగుల రమేష్, బొంగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గాలికుంటు టీకాలు పశువులకు తప్పని సరిగా వేయించాలి



ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 9 : ఇబ్రహం పట్నం మండలంలో పశువులకు గాలికుంటు రోగం రాకుండా నివారణ చర్యలలో బాగంగా ఆవులు, గేదెలకు టీకాలు వేస్తున్నామని వెలిమినేడు పశువైద్యాది కారి వై ఆనందరెడ్డి తెలియజేశారు. 9వ తేదీ రోజున తుర్కగూడలో పశువులకు గాలికుంటు టీకాలు వేసారు.గాలికుంటు రోగం రావడం వలన కొన్ని పశువులు మరణించే అవకాశం ఉంటుందని, విపరితంగా పాల దిగుబడి, పునరుత్పత్తి సామర్థ్యం తగ్గిపోయి రైతులకు అర్థిక నష్టం కలిగే అవకాశం ఉంటుది. చీలిన డెక్కలు కలిగిన అన్ని పశువులు ఈ రోగం వచ్చే అవకాశం ఉంటుంది. వ్యాది సోకినా పశువుకు జర్వం రావడం, నోట్లో నుండి చొంగ కారడం, నా లుక పెదవులపై పుండ్లు, గిట్టల యందు పుండ్లు పడడం పాలఉత్పతి కొల్పోవడం జరుగుతుంది. కావున రైతు సోదరులు గాలికుంటు టీకాలను విదిగా వేయించుకోవాలని తెలిపారు.

# ఈనెల 15 నుండి బుగ్గజాతర ఉత్సవాలు ప్రారంభం

## - ఎమ్మెల్యేను ఆహ్వానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



మంచాల, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 9 : ఈనెల 15నుండి ప్రారంభం కానున్న ఆరుట్ల శ్రీశ్రీ బుగ్గరామలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాలు. ఈ సందర్భంగా ఆరుట్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు రావుల భాషయ్య, దాసరమోని రమేష్ ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసి జాతర ఉత్సవాలకు ఆహ్వానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, మంచాల పిఏసిఎస్ చైర్మన్ వెదిరే హనుమంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ సుంకరి పాండరినాథ్ గౌడ్,మాజీ ఎంపీటీసీ కావలి శ్రీనివాస్, నాయకులు బైరిక రమాకాంత్ రెడ్డి, చీమల జంగయ్య యాదవ్, ఎండి వాజీద్, కావలి బుగ్గరాములు, గుడ్డిమల్ల చంద్రయ్య, మారగోని మాసయ్య గౌడ్, సాతిరి ఎల్లేష్, మార సురేష్, బుట్టి కృష్ణ, ఎన్నిదుల సురేష్, పంబాల బుగ్గరాములు, మార లక్ష్మణ్, కంబాలపల్లి బుగ్గరాములు, తలారి కృష్ణ బత్తుల రవీందర్, పాండాల శ్రీనివాస్, ఆమంచ జగన్, ఎం డి అశ్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలో తప్పులు లేకుండా క్షుణ్ణంగా పరిశీలించి సవరించాలి : కలెక్టర్ సి నారాయణరెడ్డి



రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, శాసనసభ న్యూస్ నవంబర్ 9 : రంగా రెడ్డి జిల్లా ఓటరు జాబితాలోని తప్పులను గుర్తించి సవరించే ప్రక్రియ క్షుణ్ణంగా పరిశీలించాలని, చనిపోయిన వారి పేర్లను జాబితా నుండి తొలగించాలని,డూప్లికేషన్ లేకుండా ఓటరు నమోదు చేపట్టాలని కలెక్టర్ నారాయణ రెడ్డి బూతు లెవెల్ అధికారులకు సూచించారు.శనివారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ లోని జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 9,10 తేదీలలో యువతీ యువకులు ఓటర్లుగా తమ పేర్లు నమోదు చేసుకోవడానికి నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపు ను జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఏవైనా లోటుపాట్లు ఉంటే సవరించడం, ఓటరు జాబితాలో డూప్లికేషన్, చనిపోయిన వారి పేర్లను జాబితా నుండి తొలగించాలని అన్నారు. నమోదు ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు జరగకుండ చేపట్టాలని తెలిపారు.సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియ నిర్వహణ పై మాట్లాడుతూ 75 కాలములలో చేపట్టే సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియను ఎన్యూమరేటర్లకు శిక్షణ సందర్భంగా ఇచ్చిన గైడ్లెన్స్ ఆధారంగా అర్థం చేసుకొని జాగ్రత్తగా సమగ్ర కుటుంబ సర్వే 75 కాలముల ఫామ్ ను పూర్తి చేయాలని తెలిపారు. కంగారుగా, ఆందోళన చెందకుండా జాగ్రత్తగా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. సర్వే నిర్వహిస్తున్న సమయంలో ఎన్యూమరేటర్లకు ఏమైన సందేహాలు ఉంటే మీపై అధికారులను అడిగి సందేహాలను నివృత్తి చేసుకున్న తరువాత సర్వే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.అనంతరం కలెక్టర్ నారాయణ రెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తయారు చేస్తున్న మధ్యాహ్న భోజనమును పరిశీలించారు. ప్రతి రోజు ఎంత మంది విద్యార్థులకు భోజనం తయారు చేస్తారని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రధాన ఉపాధ్యాయునికి సూచించారు. పదవ తరగతిని కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ క్రమశిక్షణ, మంచి అలవాట్లు అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. మీరంత క్రమశిక్షణ, పరిశుభ్రతను,మంచి అలవాట్లను పాటించి, మీతోటి విద్యార్థులను కూడా పాటించేలా చూడాలన్నారు. జీవితంలో ఎదగడానికి పదవ తరగతి తొలిమెట్టు అని అన్నారు.గడిచిన కాలాన్ని తిరిగి పొందలేమని, ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నతస్థితికి చేరుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారు గొప్ప గొప్ప స్థానాల్లో ఉన్నారన్నారు. నేను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నాని కలెక్టర్ విద్యార్థులకు తెలిపారు. ప్రతి రోజు స్కూల్ కు యునిఫాం ధరించి రావాలని, తరగతిలో ఉపాధ్యాయులు బోధించే పాఠ్యంశాలను క్షుణ్ణంగా అర్థం చేసుకొని, కసితో, క్రమశిక్షణతో చదవాలని, ఉన్నత స్థితికి మీరంత చేరుకోవాలని అన్నారు. మీ కన్న తల్లిదండ్రుల కలలను నెరవేర్చే విధంగా చదువును ఇష్టపడి చదవాలని, మన చదువుకు ఆటంకంగా మరే వస్తువులను, పరిస్థితులను అధిగమించి చదువును కొనసాగించినప్పుడే ఉన్నత స్థాయికి చేరుకుంటామన్నారు. పదవ తరగతి పరీక్షలలో మీరంత పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధించాలని తెలిపారు. విద్యార్థులకు టీం వర్క్ అలవాటు చేయాలని ప్రధానోపాధ్యాయునికి సూచించారు. నేను మరొకసారి మీ పాఠశాలకు వస్తాను.నేను వచ్చినప్పుడు మీ అందరిలో నేను సూచించిన మార్పును చూడాలని తెలిపారు.కలెక్టర్ వెంట శంషాబాద్ తహశీల్దార్ రవీందర్ దత్తా, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నంలో ఆదనపు జిల్లా కోర్టు ప్రారంభోత్సవం





ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 9 : ఇబ్రహీంపట్నంలో నూతనంగా 15వ అదనపు జిల్లా న్యాయస్థానాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాదే డిజిటల్ ద్వారా ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు శ్రీ శ్యామ్ కొశి , వినోద్ కుమార్,లక్ష్మణ్ , విజయసేన్ రెడ్డి హైకోర్టు నుంచి ప్రారంభోత్సవంలో పాల్గొనడం జరిగింది, ఇబ్రహీంపట్నం కోర్టు ప్రాంగణంలో ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రత్యక్షంగా గౌరవ ప్రధాన జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం అదనం జిల్లా న్యాయమూర్తి జయ ప్రసాద్, ఇబ్రహీంపట్నం సీనియర్ న్యాయమూర్తి శ్రీమతి శంకర్ శ్రీదేవి, అదనపు సీనియర్ న్యాయమూర్తి రీటా లాల్ చందు, ప్రధాన జూనియర్ న్యాయమూర్తి యశ్వంత్ సింగ్, అదనపు జూనియర్ న్యాయమూర్తి శ్రీమతి హిమబిందు, అసోసియేషన్ అధ్యక్షులు అంజన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జేపీ మహేందర్, సీనియర్ న్యాయమూర్తులు సత్య వీర్ రెడ్డి , రఘునందన్ రెడ్డి, మహమ్మద్ గులాం హైదర్, జి. చంద్రశేఖర్ రెడ్డి ఇతర సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవ తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాదే గారు మాట్లాడుతూ ప్రజలకు చేరువలో న్యాయసాహం అందించాలని సత్వర న్యాయం కల్పించాలని భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశాలనుసారం అదనపు న్యాయస్థానాలను ప్రారంభించడం జరుగుతుంది. అదేవిధంగా మౌలిక వసతులు కల్పించడం కోసం కృషి చేస్తారని చెప్పడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం అదనపు జిల్లాతో పాటు షాద్నగర్ లో కూడా ఒక అదనపు జిల్లా కోర్టును ప్రారంభించడం జరిగింది.

# గ్రామ పంచాయితీల్లోని మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలి

- బిల్లులు అందక మరణించిన సర్పంచ్ కుటుంబాలను ఆదుకోవాలి.
- ఇందిరమ్మ కమిటీలలో మాజీ సర్పంచులను సభ్యులుగా చేర్చాలి.





ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 9 : తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో శనివారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో పలువురు మాజీ సర్పంచులు హాజరై మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో 2019 - 2024 కాలవ్యవధిలో సర్పంచులుగా కొనసాగి రాష్ట్రవ్యాప్తంగా మాగ్రామ పంచాయతీ పరిధులలో ప్రభుత్వ సూచనలు, ఆదేశాల మేరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. గ్రామపంచాయతీలలో వీధిలైట్ల నిర్వహణ, అంతర్గత మురుగు కాలువల ఏర్పాటు, పల్లె ప్రకృతి వనం, రైతు వేదిక, వైకుంఠధామం, మనఊరు - మనబడి, పల్లెప్రగతి, గ్రామపంచాయతీల భవన నిర్మాణాలు, మిషన్ భగీరథ లాంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యంతో గ్రామ పంచాయతే గ్రామ పంచాయతీ ప్రజలతో చేపట్టి తెలంగాణ గ్రామ పంచాయతీలను దేశంలోనే ఆదర్శవంతమైన గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దడంలో మా వంతు కృషి చేయడం జరిగింది. పారిశుద్ధ్య నిర్వహణలో విప్లవాత్మకమైన మార్పును ప్రవేశపెట్టి ప్రజలతో, గ్రామపంచాయతీ సిబ్బందితో మమేకమై గ్రామాలను ఆరోగ్యవంతమైన గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దడం జరిగింది. ప్రభుత్వం నుంచి నిధులు సరైన సమయంలో అందకపోయినా సొంత గ్రామాన్ని అబివృద్ధి చేయాలి, ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలనే క్రమంలో సొంత డబ్బులు వెచ్చించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఈ క్రమంలో ప్రభుత్వం నుండి మేము అధికారంలో ఉన్నప్పుడు గాని, మా పాలకమండలి గడువు ముగిసి పది నెలలు కావోస్తున్నాగాని ఇప్పటికి మా యొక్క పెండింగ్ బిల్లులు అందగా 12,769 గ్రామపంచాయతీల సర్పంచుల యొక్క బాధలు వర్ణనాతీతం. పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు అందక గ్రామాలలో అస్తవ్యస్తమౌతున్న పారిశుద్ధ్య నిర్వహణ వ్యవస్థను చూసి మా మనసులు చలించిపోతున్నాయి. తెలంగాణకు హరితహారం అనే పేరుతో ప్రతిష్టాత్మకంగా నాటిన మొక్కలకు నీరు పోసి నాథుడు లేక మొక్కలు విలవిలలాడుతున్నాయి. గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు అప్పులు చేసి ఖర్చుపెట్టిన సర్పంచులు బిల్లులు అందక ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇట్టి విషయమై అధికారులకు, ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా ఫలితం శూన్యం. దేశానికి పట్టుకొమ్మలైన గ్రామపంచాయతీలను అభివృద్ధి పరచడంలో భాగస్వామ్యులమైన మా సర్పంచుల ప్రధాన డిమాండ్లు. గ్రామపంచాయతీలలో సర్పంచుల యొక్క పెండింగ్ బిల్లులు మొత్తం వెంటనే చెల్లించాలి. బిల్లులు అందక ఆత్మహత్యలు చేసుకుని మరియు విధి నిర్వహణలో మరణించిన సర్పంచ్ కుటుంబాలకు ప్రభుత్వం 25 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేసి ఆయా కుటుంబాలను ఆదుకోవాలి. గ్రామాలలో ప్రస్తుతం సర్పంచులు లేనందున ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కమిటీలలో మాజీ సర్పంచులకు స్థానం కల్పించాలని సమావేశంలో పేర్కొన్నారు.

## 'ఉద్యమకారులకు న్యాయం జరగాల్సిందే'



**తుర్కయంజాల్, నవంబర్ 09 ( శాసన సభ ):** ఉద్యమకారులకు ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాల్సిందేనని కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నాయకులు బండి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు.తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొంతం యాదిరెడ్డి ఆధ్వర్యంలో బండి సంజయ్‌ని పలువురు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం కోసం వీరోచితంగా పోరాడిన నాయకులను ప్రభుత్వం విస్మరించడం సరికాదన్నారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బొక్క నర్సింహారెడ్డి, బోసుపల్లి ప్రతాప్, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బచ్చిగళ్ల రమేష్, నాయకులు తూళ్ల నర్సింహ గౌడ్, ఉద్యమకారులు పి.బాలయ్యగౌడ్, కె.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## కులగణన సర్వేకు ప్రజలు సహకరించాలి



**తుర్కయంజాల్, నవంబర్ 09(శాసన సభ ) :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుల గణన వల్ల అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని టెస్కాబ్ వైస్ చైర్మన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. శనివారం తుర్కయంజాల్ లోని సత్తయ్య ఇంట్లో అధికారులు సర్వే నిర్వహించారు. అధికారులు అడిగిన వివరాలను సత్తయ్య, మాజీ సర్పంచ్ కొత్తకుర్మ కళమ్మ అందజేశారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ ప్రజలు సహకరిస్తే సర్వే సజావుగా సాగేందుకు అవకాశం ఉందని అన్నారు.

## మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కంబాలపల్లి భరత్ కుమార్ కు పితృవియోగం



**ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 9 :** ఇబ్రహీంపట్నం మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కంబాలపల్లి భరత్ కుమార్ తండ్రి కంబాలపల్లి యాదయ్య(59) అనారోగ్యంతో స్వస్థలం శేరిగూడ లో శనివారం మృతి. నేడు ఉదయం( ఆదివారం) 11 గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని కంబాలపల్లి భరత్ తెలిపారు.

## హైదరాబాద్ ఫిల్మ్ నగర్‌లో హైడ్రా కూల్చివేతలు



**హైదరాబాద్,శాసనసభ ప్రతినిధి :** హైదరాబాద్లో మళ్లీ హైడ్రా కూల్చివేతలు మొదలయ్యాయి. తాజాగా GHMC అధికారులతో కలిసి హైడ్రా అధికారులు ఫిల్మ్ నగర్లో ఆక్రమణలను తొలగించారు.ఫిల్మ్ నగర్లో రోడ్డు ఆక్రమించి నిర్మించిన కట్టడంపై స్థానికుల ఫిర్యాదుతో హైడ్రా అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్డుతో పాటు ఆ పక్కనే ఉన్న ఇంటి ప్రహరీని కూల్చి వేశారు.

## కోలాహాలంగా మాలకులస్తుల ఆత్మీయ సమ్మేళనం మాలలు ఐక్యంగా ఉంటేనే ఏదైనా సాధించవచ్చు

- ముఖ్యఅతిథిగా చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్.
- ఎస్సి వర్గీకరణపై ప్రభుత్వాలు పునస్సమీక్షించుకోవాలి.
- ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తా
- భారీ ర్యాలీతో బయలుదేరిన మాలలు
- 30 లక్షల మాలల కోసం ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా సైనికులై ముందుకు రావాలి.





**ఇబ్రహింపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 9 :** మాల మాదిగలను విభజించడానికి కుట్రలు పన్నుతున్నారని, మాలలను ఐక్యంచేసి ఒకతాటిపైకి తీసుకొచ్చి ఆత్మీయ సమ్మేళనంలో ఎన్ని ఎత్తులు వేసినా అబద్ధం నిజం కాదని వర్గీకరణ జరగనివ్వమని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లోని శాస్త్ర గార్డెన్ లో మాల మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం మాలల ఇబ్రహీంపట్నం ఐక్యవేదిక కన్వీనర్ మారయ్య, కో కన్వీనర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుండి అధిక సంఖ్యలో మాలలు ఈ ఆత్మీయ సమ్మేళనం తరలివచ్చారు.ఈ కార్యక్రమంలో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ.. ఏబిసిడి వర్గీకరణ రాజ్యాంగం బద్దంగా రావాలి, మనువాద వర్గీకరణ వద్దని అన్నారు. జాతి నిర్మాణం కోసం అన్ని వర్గాలు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. అబ్బుల సాధన కోసం విభేదాలను పక్కన పెట్టాలని అన్నారు. హక్కుల సాధన కోసం అందరూ సైనికుల ఉద్యమించాలని అన్నారు. 30 లక్షల మలల కోసం జరిగే జాతి పోరాటంలో ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా సైనికుల ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మాల ఉద్యోగులను వేధిస్తే ఊరుకునేదని హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఎలిమినేయర్ విధానాన్ని పునః సమితించాలని కోరారు.ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు



నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బుద్ధవనం ఓ ఎస్ డి మల్లేపల్లి లక్ష్మయ్య. ప్రముఖ కార్డియాలజిస్ట్ ఎంఎఫ్ గోపీనాథ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సర్వయ్య, సమతా సైనిక్ దళ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దిగంబర్ కామ్లే, ఉద్యమకారుడు ప్రజా గాయకుడు రేంజర్ల షాన్ రాజేష్, మాల మహానాడు నాయకుడు చెన్నయ్య స్థానిక నాయకులుటి ఐక్యవేదిక కో కన్వీనర్లు ఈ రాములు, భర్తకి జగన్, హనుమన్ల కిష్టయ్య, ఆవుల మల్లేష్, చిలకల బుగ్గ రాములు, ఎస్పిఆర్ మల్లేష్, టి బాలచందర్, డాక్టర్ అబ్బయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అలంకార ప్రాయంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- తక్షణమే కొనుగోలు ప్రారంభించకుంటే రైతు ఉద్యమమే
- జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి.



**ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 9 :** వరి కోతలు మొదలై 20 రోజులు దాటినా కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా మొదలు పెట్టకపోవడం సిగ్గుచేటని జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి మండిపడ్డారు. రైతుల కుప్పలు పోసుకొని కల్లాల దగ్గర పడికాపులు కాస్తున్న పట్టించుకోకపోవడం ఏంటి అని ప్రభుత్వాన్ని నిలదీశారు. రెండు రోజుల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రాలను మొక్కుబడిగా ప్రారంభించిన , నేటికీ ఒక్క గింజ కూడా కొనలేదని, ఆయన దుయ్య బట్టారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైస్ మిల్లులను కేటాయించకపోవడంతో కొనుగోలు కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయని ఆయన అన్నారు. రైస్ మిల్లర్లకు బ్యాంక్ గ్యారంటీల లింకు పెట్టడంతో వారు ముందుకు రాకపోవడంతో ధాన్యం కొనుగోలుపై అడుగులు ముందుకు పడడం లేదని ఆయన విమర్శించారు. కరోనా కష్టకాలంలో కూడా గ్రామాలకు వెళ్లి ధాన్యం కొనుగోలు చేసిన కెసిఆర్ ప్రభుత్వాన్ని రైతులు అడుగడుగున గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు. ఇప్పటికే ఈ పంట కాలానికి రైతుబంధు డబ్బులు ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం పంటలను కూడా కొనలేక రైతులను ముంచిందని అన్నారు. దళారులకు , ప్రైవేటు వ్యాపారులకు మేలు చేయడానికి , 500 బోనస్ ఎగ్గొట్టడానికి కొనుగోళ్లు చేయడం లేదని ఆయన ధ్వజమెత్తారు. సోమవారం లోగా ధాన్యం కొనుగోలు ప్రారంభించకుంటే కొనుగోలు కేంద్రాలను రైతులతో కలిసి ముట్టడిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సత్తు వెంకటరమణా రెడ్డి, ఏర్పుల చంద్రయ్య, బుగ్గ రాములు, చీరాల రమేష్, మొద్దు అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.